



పంపిణీ జాతర



- భీమవరం, ఉండి, పాలకొల్లులో పోటాపోటీ
- మిగిలిన చోట్ల సమానం..
- కొన్ని వర్గాలను మినహాయిస్తున్న వైసీపీ
- ఇదేం తీరంటూ పార్టీ శ్రేణుల్లో అసహనం
- భారీగా ఇస్తారని మొదట ప్రచారం
- తర్వాత తగ్గించడంపై పెదవి విరుపు



ఓటుకు రూ.1000 నుంచి రూ.2,500

ఎన్నికల ప్రచార పర్వం ముగిసింది. ఏ రోజు కోసమైతే ప్రజలంతా ఎదురుచూస్తున్నారో ఆ సమయం ఆసన్నమైంది. మరో 24 గంటల్లో పోలింగ్ ప్రారంభం కానుంది. గెలుపు కోసం ప్రచారాలతో హోరెత్తించిన అభ్యర్థులు చివరి అంకంలో ఓటర్లకు కోట్లాది రూపాయల నజరానాలు పంపిణీ చేస్తున్నారు. ప్రజా వ్యతిరేకతను డబ్బుతోనే తిప్పికొట్టాలని అధికార పార్టీ ప్రయత్నాలు చేస్తోంది. అత్యధికంగా ఓటర్లకు తాయిలాలు ఇస్తున్నారు. మూడు రోజుల ముందుగానే ఓటర్లకు కానుకలు ముట్టజెప్పే ప్రక్రియను ప్రారంభించారు. నరసాపురం పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీలు తాయిలాల విషయంలో పోటీ పడుతున్నాయి. స్థానికంగా ఉన్న వ్యతిరేకతను అధిగమించడానికి వైసీపీ పెద్ద మొత్తంలో ఓటర్లకు సొమ్ములు అందజేస్తోంది. జిల్లాలో అత్యధికంగా భీమవరం, తాడేపల్లిగూడెంలలోనే అభ్యర్థులు అధిక సొమ్ములు ముట్టచెబుతున్నారు.

(భీమవరం-ఆంధ్రజ్యోతి):

హోరాహోరీగా పంపకాలు

తాడేపల్లిగూడెంలో అధికార పార్టీ ఒక్కో ఓటరుకు రూ.2,500 పంపిణీ చేస్తోంది. ఇటీవల వైసీపీలో చేరిన మాజీ ఎమ్మెల్యే అనుచరవర్గం రూ.3 వేలు ఇవ్వాలని పట్టుబట్టింది. ప్రభుత్వంపైన, అభ్యర్థిపై వున్న వ్యతిరేకతను ఎదుర్కొని నిలబడాలంటే ఈ మాత్రం ఇవ్వాల్సిందేనని భావించారు. అధిష్ఠానం వద్ద ఈ మేరకు అంగీకరించి టిక్కెట్ తెచ్చుకుని, ఇప్పుడు తగ్గిస్తే ముందుగానే చేతులెత్తేసినట్టు అవుతుందని చెబుతున్నారు. దీంతో ప్రతి ఓటరుకు రూ.2,500 పంపిణీ చేస్తున్నారు. అయితే ఇక్కడ జనసేన ఓటర్లు కొందరిని పక్కన పెడుతున్నారు. మరోవైపు రూ.1,500 వరకు ఇచ్చేందుకు కూటమి అభ్యర్థి నిర్ణయించారు. ఈ మేరకు ఓటర్లకు పంపిణీ చేస్తున్నారు. గ్రామాల్లో 80 శాతం, పట్టణాల్లో 70 శాతం మేర ఓటర్లకు తాయిలాలు అందిస్తున్నారు. భీమవరంలో పంపకాలపై ప్రధాన పార్టీల అభ్యర్థులు ఒకే రీతిలో వ్యవహరిస్తున్నారు. అధికార పార్టీ ఇప్పటికే మహిళా ఓటర్లను ఆకట్టుకునేందుకు తొలివిడత వెయ్యి వంతున పంపిణీ పూర్తి చేసింది. సంఘాల ప్రతినిధులకు, సంఘాలను పర్యవేక్షించే మహిళలు భారీగా నజరానాలు ముట్టజెప్పారు. పార్టీలో కీలకమైన బాధ్యతలు నిర్వహించే గృహ సారథులకు, రాజీనామా చేసిన వలంటీర్లకు కనిష్ఠంగా రూ.20 వేలు చేతికిచ్చారు. డ్వాక్రా మహిళలతోపాటు అందరికీ ఇప్పుడు రూ.2 వేలు వంతున ఇస్తోంది. దీనికి దీటుగానే కూటమి కూడా పంపకానికి సన్నద్ధమవుతోంది. భీమవరంలో ఇప్పటివరకు పంపకాల విషయంలో ప్రధాన పార్టీల మధ్య సయోధ్య ఉండేది. ఈ సారి మాత్రం పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. ఒకరికి మించి ఒకరు అనే పోటీ నెలకొంది. ఉద్యోగుల బ్యాలెట్ ఓట్ల విషయంలోనూ అదే జరిగింది. కూటమే పైచేయిగా నిలిచింది. ఉద్యోగుల ఓట్లన్నీ దాదాపు కూటమికి ఏకపక్షమయ్యాయి. ఇప్పుడు కూటమి తరపున ప్రతి ఓటరుకు రూ.2 వేలు పంపణీ చేస్తున్నారు. నరసాపురం నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్య తక్కువగా ఉంది. అక్కడ తాయిలాలు తక్కువగా అందనున్నాయి. వైసీపీ రూ.1,500 ఇస్తోంది కూటమి జనసేన అభ్యర్థి రూ.1,000 పంపిణీ చేస్తున్నారు. ఉండిలో ఆర్థికంగా బలమైన అభ్యర్థులు పోటీ పడుతున్నారు. వైసీపీతోపాటు తెలుగుదేశం కూటమి పోటాపోటీగా పంపిణీకి సిద్ధమవుతోంది ఇప్పటికే పోస్టల్ బ్యాలెట్‌కు రూ.2 వేలు వంతున అందజేశారు. ఇండియన్ ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థి రూ.1,000 ఇచ్చారు. ఓటర్లకు అదే స్థాయిలో పంపిణీ చేస్తున్నారు. వైసీపీ రూ.2 వేలు ఇస్తోంది. కూటమి తరపున తెలుగుదేశం రూ.2 వేలు అందజేస్తోంది. ఇండియన్ ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థి రూ.1,000 అందజేస్తున్నారు. ఆచంటలో ఓటర్లకు ఇచ్చే తాయిలాల విషయంలో పోటీ నెలకొంది. ప్రధాన పార్టీలు పంపిణీ ప్రారంభించాయి. వైసీపీ నుంచి రూ.2 వేలు ఇస్తున్నారు. వైసీపీ నుంచి పెద్ద మొత్తంలోనే పంపిణీ ఉంటుందని అంతా ఆశించారు. అక్కడ రూ.2 వేలకే పరిమితమయ్యారు. తెలుగుదేశం కూటమి నుంచి రూ.1,000 ఇస్తున్నారు. మూడు రోజుల ముందుగానే మహిళలకు చీరలు పంపిణీ చేశారు. తణుకులోనూ నజరానాల విషయంలో అభ్యర్థులు పోటీ పడుతున్నారు. అధికార పార్టీ ఇప్పటికే ఓటర్లకు రూ.2 వేలు పంపిణీ చేస్తోంది. కొన్ని వర్గాలకు మాత్రమే పూర్తిస్థాయిలో ఇస్తున్నారు. జనసేన, టీడీపీ ఓటు బ్యాంకును మినహాయిస్తున్నారు. తణుకులో కూటమి అభ్యర్థి ఓటుకు రూ.1,500 ముట్టచెబుతున్నారు. ఇప్పటికే ప్రతి నియోజకవర్గంలోనూ పంపిణీలు కొలిక్కి వచ్చాయి.



పాలకొల్లులో కొందరికి మినహాయింపు

పాలకొల్లు : నియోజకవర్గంలో వైసీపీ నాలుగు రోజులుగా పంపిణీ ప్రారంభించింది. వైసీపీ అభ్యర్థి ఓటుకు రూ.3,000 ఇస్తారని నెల రోజులుగా ప్రచారం జరిగింది. అయితే ఇప్పుడు ఓటుకు రూ.1,500 మాత్రమే పంపిణీ చేయడంపై పలువురు పెదవి విరుస్తున్నారు. పాలకొల్లు, యలమంచిలి, పోడూరు మండలాల్లోని పలు గ్రామాల్లోని కమ్మ, క్షత్రియ, కాపు సామాజిక వర్గాల్లోని ఓటర్లకు సొమ్ములు పంపిణీ నిలిపి వేయాలని వైసీపీ కార్యకర్తలకు ఫోన్లు వెళ్లాయి. దీనిపై వారు తీవ్ర అసహనానికి గురవుతున్నారు. ఈ విధంగా చేస్తే ఎన్నికల ఫలితాలపై తీవ్ర ప్రభావం కనిపిస్తుందని, పార్టీ శ్రేణులు ఆందోళన చెందుతున్నారు. టీడీపీ తొలుత ఓటుకు రూ.1,000 ఇస్తారని ప్రచారం జరగ్గా, ఇప్పుడు రూ.1,500 ఇస్తున్నారు. సుమారు 90 శాతం మంది ఓటర్లకు పంపిణీ చేస్తున్నారు.



ముగిసిన ప్రచారం



- మూగబోయిన మైకులు

(భీమవరం-ఆంధ్రజ్యోతి) : ఎన్నికల ప్రచారం ముగిసింది. మరో 24 గంటల్లో పోలింగ్ ప్రారంభం కానుంది. జిల్లావ్యాప్తంగా 144 సెక్షన్ విధించారు. ఎన్నికల ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమయ్యారు. దాదాపు 45 రోజులపాటు ఊరూ వాడా, పల్లె, పట్టణాల్లో అభ్యర్థులు ప్రచారాలు నిర్వహించారు. ఆటోలలో రికార్డులు పెట్టి హోరెత్తించారు. సినీ నటులు ప్రచారాల్లో సందడి చేశారు. అభ్యర్థులు, కుటుంబ సభ్యులంతా ఉదయం నుంచి రాత్రి వరకు ప్రతి ఇంటా తిరిగారు. ఓటర్లను కలుసుకున్నారు. ఈ సారి సుదీర్ఘ వ్యవధి ఉండడంలో ప్రచారాలతో ఎన్నికలు సందడిగా మారాయి. ఒకరిపై ఒకరు విమర్శనాస్త్రాలు సంధించుకున్నారు. రాష్ట్ర నేతలు ప్రచారాలకు విచ్చేశారు. గబ్బర్‌సింగ్ టీమ్ జనసేన అభ్యర్థుల తరపున ప్రచారంలో పాల్గొన్నారు. భీమవరం, తాడేపల్లిగూడెంలో పర్యటించారు. సుడిగాలి సుధీర్, పృథ్వీరాజ్, ఆటో రాంప్రసాద్ పర్యటించి సందడి చేశారు. కూటమి తరపున ప్రచారం నిర్వహించారు. శనివారం సాయంత్రం 5 గంటలకు ప్రచారం ముగిసింది. ఆటో చక్రాలు నిలిచిపోయాయి. మైకులు మూగబోయాయి. అభ్యర్థులు ఇళ్లకు చేరుకున్నారు. తాయిలాల పంపిణీలో నిమగ్నమయ్యారు. జనమంతా పోలింగ్ కోసం ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. ఈ సారి ఇతర రాష్ట్రాల నుంచి స్వచ్ఛందంగా ఓటర్లు తరలి వస్తున్నారు. కొందరు అభ్యర్థులు రవాణా సౌకర్యం కల్పించారు.

తమ వారికే తాయిలాలు

తాయిలాల పంపిణీలో వైసీపీ ఓ వ్యూహంతో వెళుతోంది. నియోజకవర్గాల్లో తమకు అనుకూరులు ఎవరో.. కాని వారు ఎందరో లెక్కలు వేసుకుని జాబితాలు సిద్ధం చేసింది. గృహ సారథులు, వలంటీర్ల ద్వారా వివరాలు సేకరించింది. దాని ఆధారంగానే పంపిణీకి శ్రీకారం చుట్టింది. ఎన్నికల వ్యయాన్ని తగ్గించుకోవాలని చూస్తోంది. కూటమికంటే అధికంగా ఇవ్వడానికి వెసులుబాటు కావాలంటే టీడీపీ, జనసేన ఓటు బ్యాంకును మినహాయించాలనే ఆలోచన చేసింది. మరోవైపు ప్రజా వ్యతిరేకతను ఎదుర్కోవడానికి తాయిలాలే ఆయుధంగా కనిపిస్తోంది.

ఊహించింది ఎంతో..



వైసీపీ ఈసారి పెద్ద మొత్తంలో నజరానాలు ఇస్తారని ఆశించారు. కేడర్‌కే కోట్లు ఖర్చు పెట్టారు. అధిష్ఠానం ప్రతి నియోజక వర్గానికి పెద్ద మొత్తంలో చేరవేసింది. దీనికి కలుపుకుని అభ్యర్థులు ఎంత ఇవ్వాలనేది ముందుగానే నిర్ణయించుకున్నారు. ఇప్పుడు క్షేత్రస్థాయిలో పరిస్థితులు మారిపోతున్నాయి. అధిష్ఠానం సొమ్ములు ఇచ్చే విషయంలో వెనకడుగు వేసింది. ముందుగా అనుకున్న దానికంటే దాదాపు సగానికి తగ్గించేసింది. దీంతో వైసీపీ అభ్యర్థులు ఇచ్చే తాయిలాలు తగ్గిపోతున్నాయి. క్షేత్రస్థాయి పరిస్థితులను అంచనా వేసుకున్న కొందరు ఉద్దేశ పూర్వకంగానే తాయిలాలను కుదించారు. జనం మాత్రం వైసీపీ ఎంతో ఇస్తుందని ఊహించారు. తాడేపల్లిగూడెంలో జనసేన ఓటు బ్యాంకును మినహాయిస్తున్నారు. పాలకొల్లులోనూ అదే పరిస్థితి. అక్కడ కూటమికి పక్కా ఓటు బ్యాంకు అనే సామాజిక వర్గాలను మినహాయించి పంపిణీలు చేస్తున్నారు.



యలమంచిలిలో ప్రభుత్వ మద్యంషాపు వద్ద బారులు తీరిన మద్యపానప్రియులు

మందుబాబుల ముందుచూపు

- మద్యం షాపులకు పోటెత్తి కొనుగోలు
- రూ.150 బాటిళ్ల నిలిపివేత
- అంతా ఖరీదైన మద్యమే అమ్మకాలు

(భీమవరం-ఆంధ్రజ్యోతి) : మద్యం షాపులు మూతపడ్డాయి. ఎన్నికలు ముగిసేంత వరకు తెరచుకోవు. సోమవారం సాయంత్రం ఆరు గంటలకు తిరిగి తెరిచే అవకాశం ఉంటుంది. బార్‌లు, మద్యం షాపులు మూతపడనున్నాయని తెలియడంతో మందుబాబులు షాపులకు పోటెత్తారు. మద్యం షాపుల వద్ద ఉదయం నుంచే బారులు తీరారు. శనివారం ఒక్కరోజే దాదాపు రూ.4 కోట్ల విలువైన మద్యం అమ్ముడుపోయింది. సామాన్యులకు అందుబాటులో ఉండే రూ.150 బాటిళ్ల సరఫరా నిలిపివేశారు. కేవలం రూ.230, రూ.430, అంతకుమించి ఖరీదైన మద్యాన్ని మాత్రమే అందుబాటులో ఉంచారు. అవికూడా హాట్ కేకుల్లా అమ్ముడుపోయాయి. జిల్లాలోని బార్‌లు, ప్రభుత్వ మద్యం షాపులు అమ్మకాలతో హోరెత్తాయి. అధికార పార్టీ అభ్యర్థులు భారీ మొత్తంలోనే నిల్వ చేసుకున్నారు. కార్యకర్తలకు పంపిణీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. అయినా సరే శనివారం జిల్లా వ్యాప్తంగా మద్యం అమ్మకాలు జోరుగా సాగాయి. ఖరీదైన మద్యం కొనుగోలుకు మద్యపానప్రియులు ఎగబడ్డారు. రెండు రోజుల పాటు అమ్మకాలకు సంబంధించిన సొమ్ములను బ్యాంకుల్లో జమ చేయనున్నారు. ఇందు కోసం ఆదివారం కూడా సంబంధిత బ్యాంకులు తెరిచేలా చర్యలు తీసుకున్నారు.

ఎన్నికలకు సర్వం సిద్ధం

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



భీమవరంటౌన్, మే 11 జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వ యంత్రాంగం సర్వం సిద్ధంగా ఉన్నట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. ఎన్నికల నిర్వహణపై శనివారం ఆయన పలు విషయాలను తెలిపారు. రీ-పోలింగ్‌కు అవకాశం లేకుండా సార్వత్రిక ఎన్నికలలో హింసకు తావులేని, రీ-పోలింగ్‌నకు అవకాశం ఇవ్వని ఎన్నికల కోసం జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందన్నారు. దేశ సంప్రదాయాలను గౌరవించి ఓటుహక్కు వినియోగించుకోవడంలో ఎలాంటి ప్రలోభాలకు గురి కావొద్దని ప్రతిఒక్కరూ పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు హక్కును వినియోగించుకునేలా చైతన్యవంతులు కావాలని, స్వేచ్ఛాయుత వాతావరణంలో, ప్రశాంతంగా పోలింగ్ సాగేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

జిల్లాలో 144 సెక్షన్ అమలు

సోమవారం ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో శనివారం సాయం త్రం ఆరు గంటల నుంచి సోమవారం సాయంత్రం ఆరు గంటల వరకు జిల్లావ్యాప్తంగా 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. 12వ తేదీన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి పోలింగ్ యంత్రాలు, సిబ్బందిని పోలింగ్ కేంద్రాలకు పంపుతామన్నారు.

ప్రచారాలు చేయకూడదు

ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రకారం పోలింగ్ తేదీకి 48 గంటల ముందు అనగా ఈనెల 11వ తేదీ సాయంత్రం ఆరు గంటల నుంచి ప్రచారం ఆపేయాల్సివుంటుంది. ఈ సైలెన్స్ పీరియడ్‌లో ఎవరు ప్రచారం చేసినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

ఎగ్జిట్ పోల్స్ నిషేధం

ఎన్నికల సమయంలో ఎగ్జిట్ పోల్స్ ప్రచురణ, ప్రసారాలు నిషేధమన్నారు. రాజకీయ పార్టీలు, వారి ప్రతినిధులు ఓటర్లను ప్రలోభాలకు గురి చేయరాదని, అలా చేసినట్లు తెలిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. జిల్లావ్యాప్తంగా ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ టీమ్‌లు సమర్థంగా పనిచేస్తున్నాయి.

రూ.3.70 కోట్ల విలువైనవి స్వాధీనం

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటివరకు నగదు రూ.1.29 కోట్లు, మద్యం రూ.41.8 లక్షలు, బంగారం, వెండి వస్తువులు రూ1.98 కోట్లు, లోహ పరికరాలు, వస్తువులు రూ.17లక్షలు మొత్తం రూ.3.70 కోట్ల విలువ కలిగినవి స్వాధీనం చేసుకున్నాం. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు 282 జిల్లాలో 1,463 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయగా వాటిలో 282 పోలింగ్ స్టేషన్లను సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించాం. పోలింగ్ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 140 మంది సెక్టార్ అధికారులను, 140 మంది సెక్టార్ పోలీస్ అధికారులను, 282 మంది మైక్రో అబ్జర్వర్లు పోలింగ్ పరిస్థితిని క్షేత్రస్థాయిలో సమీక్షించడానికి నియామకం జరిగింది.

1,463 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్

జిల్లాలో నూరుశాతం పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ చేసేందుకు ఏర్పాటు చేశారు. పోలింగ్ సరళిని లైవ్ ద్వారా జిల్లా కేంద్రంలోని కంట్రోల్ రూమ్ నుంచి పర్యవేక్షిస్తాం.


పోలింగ్ స్టేషన్లో మౌలిక సదుపాయాలు

వేసవి దృష్ట్యా పెరుగుతున్న ఉష్ణోగ్రతల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల వద్ద షామియానాలు, చల్లటి నీరు, ఫ్యాన్లు ఏర్పాటు చేస్తాం. ప్రధానంగా విద్యుత్తు సౌకర్యం, దివ్యాంగులు, వృద్ధులు సులువుగా కేంద్రంలోకి వెళ్లేందుకు ర్యాంపులు ఏర్పాటు చేశాం. వారికోసం వీల్‌చైర్లు అందుబాటులో ఉంచాం. ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, క్యూ లైన్ల నిర్వహణ చేపడుతున్నామ న్నారు. విధుల్లో ఉన్న సిబ్బంది ఇబ్బందులు పడకుండా మరుగుదొడ్లు, నీటి సౌకర్యం, భోజన వసతి ఏర్పాటుకు చర్యలు తీసుకున్నాం.

581 వాహనాలు, 12 బోట్లు సిద్ధం

పోలీసుల బందోబస్తు మినహా ఈ ఎన్నికల కోసం 581 వాహనాలు సిద్ధం చేశాం. జీపీఎస్ ఆధారిత వాహనాలు పోలింగ్ సామగ్రితోపాటు సిబ్బందిని ఆయా కేంద్రాల వద్ద దించడం, పోలింగ్ ప్రక్రియ పూర్తయిన తర్వాత తీసుకురావడం చేస్తాయి. ఇందుకుగాను 160 ఆర్టీసీ బస్సులు, 260 మినీ బస్సులు, 21 ఇతర వాహనాలు, 11 బోట్లు సిద్ధంగా ఉన్నాయి. ప్రతి రూటుకు ఒక సెక్టార్ ఆఫీసర్ ఉంటారు. 1,659 మంది పీవోలు, 16మంది ఏపీవోలు, 6,251 మంది ఓపీవోలను ఎన్నికల విధులకు నియమించాం.

రిసెప్షన్ కేంద్రాలుగా ఎస్ఆర్‌కేఆర్, విష్ణు ఇంజనీరింగ్ కాలేజీలు



ఎన్నికలలో రిసెప్షన్ కేంద్రం వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేశాం. వచ్చే నెల నాలుగో తేదీన కూడా ఆయా రిసెప్షన్ కేంద్రాల్లో కౌంటింగ్ నిర్వహిస్తాం.పోలింగ్ సామగ్రి డిస్ట్రిబ్యూషన్ కోసం భీమవరం, ఉండి నియోజకవర్గాలకు ఎస్ఆర్‌కేఆర్ కాలేజీలోనూ, మిగతావి ఆయా నియోజకవర్గ ముఖ్యకేంద్రాల్లో ఏర్పాటు చేశాం. అక్కడి నుంచి పోలింగ్ సామగ్రిని సిబ్బంది వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు తీసుకువెళ్తారు.

24 గంటలూ కంట్రోల్ రూమ్

ఎక్కడైనా చిన్న చిన్న సమస్యలు తలెత్తితే సంయమనం పాటించాలని కోరుతున్నాం. ఓటర్లకు సంబంధించిన సమాచారం కోసం 1950లో సంప్రదించవచ్చు. ఎవరైనా మద్యం, నగదు ఇతర బహుమతులతో ప్రలోభాలకు గురి చేస్తే సీ-విజిల్ యాప్‌కు నేరుగా వీడియోలు, ఫొటోలు పంపించవచ్చు. మీ ఫిర్యాదు అందిన వంద నిమిషాల్లోపే సంబంధిత అధికారులు అక్కడికి చేరుకొని వాటిని అడ్డుకుంటారు. ఎన్నికలు మొదలు పూర్తయ్యేంత వరకు కమాండ్ కంట్రోల్ రూమ్‌లో అధికారులంతా పర్యవేక్షిస్తారు.

రేపు ఉదయం ఏడు గంటల నుంచి పోలింగ్



సోమవారం ఉదయం ఏడు గంటలకు పోలింగ్ ప్రారంభమవుతుంది. అందుకు సిబ్బందికి అన్ని రకాల శిక్షణ ఇచ్చాం. కొన్నిచోట్ల సాయంత్రం ఆరు గంటలు దాటినా క్యూలైన్‌లలో వేచి ఉండే ఓటర్లకు ఓటు వేసే అవకాశాన్ని కల్పిస్తాం.

బృందాలతో వెబ్ కాస్టింగ్ పర్యవేక్షణ

పోలింగ్ డే పర్యవేక్షణ విధానం (పీడీఎంఎస్), వెబ్ కాస్టింగ్ పర్యవేక్షణ బాధ్యతలను ఆయా బృందాలు నిబద్ధత కలిగి నిర్వర్తించాలని స్పష్టం చేశాం. శనివారం జిల్లా కలెక్టరేట్ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి 12 తేదీన పోలింగ్ సామగ్రి పంపిణీ, 13న పోలింగ్ ప్రక్రియపై జిల్లా కలెక్టరు సమీక్ష నిర్వహించారు.

మూడో ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి

ఎన్నికల విధులు నిర్వహించే పోలింగ్ పర్సనల్ మూడో ర్యాండమైజేషన్ ప్రక్రియను సాధారణ పరిశీలకులు ఎం.దీప, ఎల్.నిర్మల్‌రాజ్ పరిశీలనలో పూర్తి చేశామని కలెక్టర్ తెలిపారు. శనివారం కలెక్టరేట్ వశిష్ట కాన్ఫరెన్స్ హాల్‌లో వారితో కలిసి ఆయన సంయుక్తంగా రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశమై నియోజకవర్గాల వారీగా ఎన్నికల విధుల్లో పాల్గొనే పీవోలు, ఏపీవోలు, ఓపీవోలు, మైక్రో అబ్జర్వర్ల మూడో ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేశామన్నారు.


ఉరి వేసుకునే ఫ్యాన్‌కు ఓటేయొద్దు

- ఉండి కూటమి అభ్యర్థి కనుమూరి రఘురామకృష్ణరాజు

పాలకోడేరు, మే 11 : ఉరి వేసుకునే ఫ్యాన్‌కు ఓటు వేయవద్దని ఉండి నియోజకవర్గంలో వైసీపీ నుంచి ఇద్దరు పోటీ చేస్తున్నారని ఒకరిది ఫ్యాన్ గుర్తు, మరొకరిది వేరే గుర్తుతో పోటీ చేస్తున్నారని అటువంటి వారికి ఓటు వెయ్యవద్దని సైకిల్ గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కూటమి అభ్యర్థి కనుమూరి రఘురామకృష్ణరాజు అన్నారు. శనివారం గొల్లలకోడేరులో చివరి రోజు ఆయన విస్తృత ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం మన ఆస్తులను తాకట్టుపెట్టే విధంగా జీవోలు తీసుకొచ్చాడని, అటువంటి వారికి ఓటు వేస్తే మనకు భవిష్యత్తు ఉండదన్నారు. జూన్ ఐదున ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసేది చంద్రబాబేనన్నారు. ఉండి జనసేన ఇన్‌చార్జి జుత్తిగ నాగరాజు, టీడీపీ నాయకులు కామన రాంబాబు, కమిలి రాంబాబు, గాదిరాజు సూర్యనారాయణ రాజు, బత్తిన నాగేశ్వరరావు, కృష్ణంరాజు, బాపిరాజు, కోటిరాజు పాల్గొన్నారు.

రఘురామ సమక్షంలో చేరిన వైసీపీ నాయకులు

ఉండి తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కనుమూరు రఘురామకృష్ణరాజు సమక్షంలో ఉండి, చెరుకువాడలకు చెందిన దాసరి సనాతన, కొండవీటి సత్యనారాయణ, గుండాబత్తుల సతీష్ తదితరులు వైసీపీ నుంచి టీడీపీలో చేరాఉఉవ వారిని రఘురామ సాదరంగా ఆహ్వానించారు.



రఘురామ సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

బ్యాలెట్ నమూనాలో నెం.1 నాదే

ఎన్నికల బ్యాలెట్ నమూనాలోపైనుంచి వున్న ఆయా గుర్తులన్నింటిలో నంబర్ వన్ స్థానంలో తనకు కేటాయించిన సైకిల్ గుర్తు వుందని ఓటర్లు అంతా గమనించి తనను ఆశీర్వదించాలని, భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. నామినేషన్ వేసిన దగ్గర నుంచి ప్రచారం ముగిసిన వరకు తనతో పాలుపంచుకున్న ప్రతీఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

జగనొస్తే భూములు లాక్కోవడమే..

- తణుకు కూటమి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ

తణుకు, మే 11 : జగన్ వస్తే భూములు లాక్కోవడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. శనివారం పట్టణంలోని ఎన్టీఆర్ పార్కు నుంచి ప్రారంభమైన కూటమి నాయకుల బైక్ ర్యాలీ ప్రధాన వీధుల మీదుగా సాగింది. పట్టణం అంతా పసుపుమయమైంది. ర్యాలీలో గుర్రాలు ఆకర్షణగా నిలిచాయి. పాసు పుస్తకాలు, అడంగళ్ పత్రాలు తీసేసుకుంటారని, వాటిని తాకట్టు పెట్టుకుని ప్రభుత్వం అప్పులు తెచ్చుకుం టుందని, అందుకే జగన్ చిత్రం ముద్రిస్తున్నారని వివరించారు. మన ఆస్తులు, భూములు లాక్కునే జగన్ కావాలో, మన ఆస్తుల విలువ పెంచే చంద్రబాబు కావాలో ప్రజలు తేల్చుకోవాలని సూచించారు. వైసీపీ దుర్మార్గ పాలనను తరమికొట్టే రోజు వచ్చిందన్నారు. రైతు సోదరులకు అండగా ఉంటామని అన్నారు. ధాన్యం ఎక్కడ కావాలంటే అక్కడ అమ్ముకునే ఏర్పాటు చేస్తామని, తేమ శాతంతో నిమిత్తం లేకుండా కొనుగోళ్ళు జరిపిస్తామని స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలు, ఐకేపీ ద్వారా ధాన్యం పట్టుబడులు జరుగుతాయన్నారు. ఎన్నికల్లో అసెంబ్లీ అభ్యర్థినైన తనకు సైకిల్‌పై, ఎంపీ అభ్యర్థికి కలమలం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ర్యాలీలో పెద్ద ఎత్తున కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



తణుకులో కూటమి నాయకులతో ఆరిమిల్లి భారీ బైక్ ర్యాలీ

పాలకొల్లు

సైకిల్ హోరు

పాలకొల్లు నియోజకవర్గంలో టీడీపీ, అధికార వైసీపీ మధ్య ప్రధాన పోటీ నెలకొంది. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రచారంతో సైకిల్ హోరెత్తిపోతోంది. రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా పనిచేసిన నిమ్మల అధికార పక్షం, ప్రతిపక్షంలో సైతం ప్రజల మన్నన పొందారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రజా వ్యతిరేక విధానాలపై అవిశ్రాంత పోరాటంతో ఆయన ప్రజలకు మరింత చేరువయ్యారు. మరోవైపు వైసీపీ అభ్యర్థి నియోజకవర్గానికి కొత్త. ఎన్నికల ఏడాదిలో ఆయనను పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించినప్పటికీ పార్టీ సీనియర్ నేతల నుంచి సహకారం కొరవడింది. ఎన్నికల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభ్యర్థి సామాజిక వర్గం ఓట్లు గెలిపిస్తాయని నమ్మకంతో ఉన్నారు. కూటమి నుంచి టీడీపీ శ్రేణులతో పాటు నిమ్మల కుటుంబం, జనసేన కార్యకర్తలు నియోజకవర్గం అంతా విస్తృతంగా కలియతిరుగుతున్నారు.

- పాలకొల్లు అర్బన్

- హ్యాట్రిక్ దిశగా నిమ్మల
- కలిసివచ్చిన కూటమి శ్రేణులు
- వైసీపీ అభ్యర్థిపై స్థానికేతరుడిగా ముద్ర
- సొంత సామాజికవర్గం ఓట్లపై ఆశలు



నిమ్మల రామానాయుడు



బలాలు..
- రాజకీయంగా గట్టి పునాది
- అన్ని గ్రామాల్లో నాయకులు సహకారం
- క్రమశిక్షణ, ప్రణాళిక బద్ధంగా పనులు చేయడం
- నిత్యం ప్రజల్లో ఉంటూ అందరివాడుగా గుర్తింపు
- అభివృద్ధి కాముకుడు

బలహీనతలు
- ఆర్థికంగా వెనుకబడి ఉండడం.
- ఎవరికి ఏ పని చెప్పినా వారిపై మరొకరిని నిఘా పెట్టడం

గుడాల గోపి



బలాలు..
- అధికార పార్టీ అండ
- ఆర్థికంగా బలవంతుడు
- సామాజికవర్గం ఓట్లు కురిపిస్తాయన్న ఆశ
- కొత్తగా వచ్చిన వారు సహకారం

బలహీనతలు
- స్థానిక నేతల సహకారం అంతంత మాత్రం
- కులాన్నే నమ్ముకున్నారన్న ప్రచారం
- స్థానికేతరుడు అన్న అంశం.
- కార్యకర్తలకు అందుబాటులో ఉండరు

పాలకొల్లు నియోజకవర్గంలో సైకిల్ హోరెత్తుతోంది. తెలుగుదేశం పార్టీ కూటమి తరఫున సిట్టింగ్ ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు, అధికార వైసీపీ అభ్యర్థిగా గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) మధ్య ప్రధాన పోటీ నెలకొంది. నిమ్మల రామానాయుడు 2014, 2019లో వరుస విజయాలు సాధించి హ్యాట్రిక్ దిశగా దూసుకుపోతున్నారు. మరోవైపు అధికారపార్టీ అభ్యర్థి గుడాల గోపి విజయం కోసం సర్వశక్తులు ఒడ్డుతున్నారు. రాజకీయంగా రాటుదేలిన రామానాయుడు వ్యూహాత్మకంగా ప్రచారంలో దూసుకుపోతున్నారు. ప్రతిపక్షంలో ఉండి అనేక విధాలుగా పోరాటం చేస్తున్న రామానాయుడు ప్రజల్లో మమేకం అయ్యారు. 2014లో వచ్చిన మెజార్టీకి మూడొంతుల మెజార్టీని 2019లో సాధించారు. తిరిగా మూడోసారి మరింత మెజార్టీ సాధించే దిశగా నిమ్మల పావులు కదుపుతున్నారు. అధికార పార్టీపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకత, టీడీపీతో జనసేన, బీజేపీ జతకట్టడం వంటి అంశాలు రామానాయుడుకు కలిసివస్తున్నాయి. మూడోసారి విజయం సాధించి హ్యాట్రిక్ సాధిస్తానన్న ధీమా రామానాయుడులో కనిపిస్తోంది. పోస్టల్ బ్యాలెట్‌లో పోలైన ఓట్లలో 90శాతం టీడీపీ అభ్యర్థికే పడినట్టు ప్రచారం కావడం కూటమి శ్రేణులు మెజారిటీపై లెక్కలు వేస్తున్నారు.

వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా పది నెలల క్రితం గుడాల గోపిని ఆ పార్టీ ఎంపిక చేసింది. వీరవాసరం మండలానికి చెందిన గోపి స్థానికేతరుడు అంటూ ఆ పార్టీ వారే పెదవి విరిచారు. వీరవాసరం భీమవరం నియోజకవర్గం కావడంతో పాలకొల్లు ప్రజలు కూడా స్థానికేతరుడిగానే చూస్తున్నారు. అభ్యర్థిత్వ రేసులో ఉండడంతో పాలకొల్లు శివారు ప్రాంతానికి నివాసం మార్చి నిత్యం ప్రజల మధ్య ఉండే ప్రయత్నం చేస్తున్నారు. పాలకొల్లు, యలమంచిలి, పోడూరు. పాలకొల్లు మండలంలో గుడాల గోపి విస్తృతంగా పర్యటిస్తున్నారు. అయితే పెద్ద నాయకులు కొందరు దూరంగా ఉంటున్నారు. తన సామాజికవర్గమే విజయం సాధించి పెడుతుందని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు తనను గెలిపిస్తాయని గోపి నమ్మకంతో ఉన్నారు. ఈనేపథ్యంలో పాలకొల్లు నియోజకవర్గంలో అధికార, ప్రతిపక్షాల మధ్య పోటీ రసవత్తరంగా మారింది. అసెంబ్లీ బరిలో 15 మంది ఉన్నప్పటికీ టీడీపీ, వైసీపీ అభ్యర్థులే ప్రధాన పోటీదారులు. టీడీపీ కూటమి వ్యూహాత్మకంగా దూసుకుపోతుంటే మరో జాతీయ పార్టీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అర్జునరావు ప్రచారం నామమాత్రంగా సాగుతోంది. ఇతర పార్టీలు, స్వతంత్రులు నామమాత్రంగా మిగిలారు.

పాలకొల్లు నియోజకవర్గం
పాలకొల్లు, యలమంచిలి, పోడూరు మండలాలు

మొత్తం ఓటర్లు 1,95,050 మంది
పురుషులు: 95,245 మహిళలు: 98,841
ఇతరులు : 6

అసెంబ్లీ బరిలో అభ్యర్థులు

1. కొలుకులూరి అర్జునరావు	కాంగ్రెస్
2. ఏలియా కొల్లాబత్తుల	బీఎస్పీ
3. గుడాల శ్రీహరి గోపాలరావు	వైసీపీ
4. నిమ్మల రామానాయుడు	టీడీపీ
5. పోలిశెట్టి శివకృష్ణ	పిరమిడ్
6. బెజవాడ తులసీరావు	జైభారత్
7. అనంత నాగభూషణం	స్వతంత్ర
8. కొటికలపూడి ప్రదీప్	స్వతంత్ర
9. జల్లా వాసు	స్వతంత్ర
10. తానేటి చిన్నఅబ్బులు	స్వతంత్ర
11. తెన్నేటి ప్రసాద్	స్వతంత్ర
12. నల్లి రాజేష్	స్వతంత్ర
13. పాలపర్తి జాన్సన్	స్వతంత్ర
14. వసంతాల డివి సురేష్	స్వతంత్ర
15. నలాది శ్రీరామమూర్తి	స్వతంత్ర

పోలవరం ఉత్కంఠ పోరు

- కూటమి, వైసీపీ హోరాహోరీ
- జనసేన వైపే యువత
- ప్రతిష్టాత్మక పోలవరం ప్రాజెక్టు స్థలిలో రాజకీయ పోరాటం

చిర్రి బాలరాజు, జనసేన కూటమి



బలం
- వివాదాలకు దూరంగా ఉండడం
- అణిగిమణిగి ఓర్పుగా పైకి ఎదగడం
- పవన్‌కల్యాణ్ నమ్మకంతో తనను నిలబెట్టారన్న విశ్వాసం
- కీలక నియోజకవర్గంలో తాను ఒక అభ్యర్థిననే ఆత్మవిశ్వాసం
- వైసీపీని ఢీకొనే స్థాయికి చేరడం

బలహీనతలు
- ఆర్థిక వెసులుబాటు లేకపోవడం
- అందరిని సమన్వయపరచడంలో కొన్ని నిర్ణయాలు తీసుకోలేకపోవడం
- ఎవర్నీ నొప్పించని మనస్తత్వం

తెల్లం రాజ్యలక్ష్మి, వైసీపీ



బలం
- భర్త బాలరాజు ఇన్నాళ్లు ఎమ్మెల్యేగా ఉండడం
- గిరిజన మహిళగా పోటీలో నిలుస్తుండడం
- వివాదాలకు దూరంగా మెలగడం
- ఉపాధ్యాయ వృత్తి నుంచి నేరుగా పాలిటిక్స్‌లోకి

బలహీనతలు
- భర్తపై ప్రజల్లో అసంతృప్తి
- ముంపు గ్రామాల్లో సమస్యలు
- నిర్వాసితుల్లో ఆర్అండ్ఆర్ పరిహారంపై ఆగ్రహం
- ప్రభుత్వ వ్యతిరేకత

జాతీయ స్థాయి ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ స్థలిలో రాజకీయ పోరు ఉత్కంఠ రేకెత్తిస్తోంది. జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి, అధికార పార్టీ వైసీపీ అభ్యర్థుల నడుమ హోరా హోరీ పోరు సాగుతోంది. కూటమి శ్రేణులను సమన్వయం చేసుకుని జనసేన అభ్యర్థి ప్రచారంలో దూసుకువెళుతున్నారు. యువత మొత్తం జనసేనకు మొగ్గు చూపడం అధికార పార్టీకి ముచ్చెమటలు పట్టిస్తోంది. మరోవైపు వైసీపీ అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి భర్త సహకారంతో కార్యరంగంలో దిగారు. ఎమ్మెల్యేగా భర్త అనుభవం ఆమెకు కలిసొచ్చే అంశంగా భావిస్తున్నా నిర్వాసితుల్లో వ్యతిరేకత విజయావకాశాలను ప్రభావితం చేయనుంది. ఎమ్మెల్యేపై ప్రజల్లో సానుకూలత లేకపోవడంతో ఆయన భార్యను వైసీపీ పోటీలో దింపింది. పార్టీ, భర్తపై వ్యతిరేకతను అధిగమించి రాజ్యలక్ష్మి విజయం సాధించడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

- ఏలూరు, ఆంధ్రజ్యోతి

పోలవరం నియోజకవర్గంలో రాజకీయ పోరు ఉత్కంఠభరితంగా మారింది. ఒకరిది రాజకీయంగా ఎదిగే వయస్సులో ఎమ్మెల్యే టిక్కెట్ దక్కిన అదృష్టం. మరొకరు భర్తపై సానుకూలత లేకపోవడంతో ఆయన స్థానంలో దిగిన పరిస్థితి. రాష్ట్రస్థాయిలోనే గుర్తింపు పొందిన పోలవరం ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతంలో కొత్త అభ్యర్థులు హోరా హోరీ తలపడుతున్నారు. అధినేత పవన్‌కల్యాణ్ నేరుగా జనసేన తరఫున చిర్రి బాలరాజును పోటీకి దింపడం గమనార్హం. అతిపెద్ద నియోజకవర్గంగా గిరిజన, గిరిజనేతర కుటుంబాలు, సమస్యలకు ఆలవాలమైన ప్రాంతం నుంచే ఎన్నికల రణరంగంలోకి దూకడం ఆయనకు సవాల్ కానుంది. జనసేన అభ్యర్థి చిర్రి బాలరాజు కూటమి పక్షాన మిగిలిన పార్టీల నేతలతో ఓపికగా వ్యవహరించడం ప్రతి అంశంలో సమన్వయం, మాట తప్పకుండా, గీత దాటకుండా జాగ్రత్త పడడం, జనసేన ఇచ్చిన వరాన్ని కాపాడుకోవడం ఆయనకు కొత్త పాఠాలే నేర్పింది. ఎస్టీ రిజర్వుడ్ నియోజకవర్గం, పోలవరం ప్రాజెక్టు ముంపు సమస్య, సహాయ పునరావాస ప్యాకేజీలో లోటుపాట్లు ఇంకోవైపు అనేక సమస్యలపై ఎన్నో పోరాటాలు సలిపిన ప్రాంతంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా బాలరాజు రంగంలో దిగారు. అందర్నీ సర్దుబాటు చేసుకుంటూ ముందుకు సాగుతూనే ఉన్నారు. తన సమీప ప్రత్యర్థి వైసీపీతో నేరుగా ఢీకొంటున్నారు. ఆర్థికంగా కొంత వెనుకబాటు అయినా పవన్‌కల్యాణ్ స్ఫూర్తి, కూటమి నేతల సహకారంతో వైసీపీకి కంట్లో నలుసుగా మారారు.

పోలవరం నియోజకవర్గం
పోలవరం, కుక్కునూరు, వేలేరుపాడు, బుట్టాయగూడెం, టి.నరసాపురం, జీలుగుమిల్లి, కొయ్యలగూడెం మండలాలు

ఓటర్లు : 2,53,981
పురుషులు : 1,22,760
మహిళలు : 1,31,212

అసెంబ్లీ బరిలో అభ్యర్థులు

1. చిర్రి బాలరాజు	జనసేన
2. తెల్లం రాజ్యలక్ష్మి	వైసీపీ
3. దువ్వెల సృజన	కాంగ్రెస్
4. ఎం.వెంకటేశ్వరావు	గోండ్వాన
5. సరియం రామ్మోహన్	సీపీఐ ఎంఎల్
6. మొడియం శ్రీనివాసరావు	ఆదివాసీ
7. మడకం వెంకటేశ్వరావు	బీఎస్పీ
8. మంగమ్మ	యువతరం
9. సరియం సూరమ్మ	స్వతంత్ర
10. బాడిస బుజ్జిదొర	స్వతంత్ర
11. కాక కృష్ణ	స్వతంత్ర
12. ఎం.సూర్యచంద్రరావు	స్వతంత్ర

పోలవరం నియోజకవర్గంలో ఉన్న రాజకీయాలను ఆకళింపు చేసుకుని ముందుకు సాగుతున్నారు. గెలుపు అందుకోవడానికి వీలుగా పావులు కదుపుతున్నారు. బాలరాజుకు కూటమి సమష్టి నాయకత్వమే బలం.

సిట్టింగ్ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు సుదీర్ఘకాలం ఇక్కడ ఎమ్మెల్యే. రాజకీయ ఒడిదుడుకులను ఎదుర్కొని నిలదొక్కుకున్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతం కావడంతో అందరి కన్ను ఇక్కడే. అనేకమార్లు కీలక నేతలు పర్యటనలకు రావడం ఎమ్మెల్యే బాలరాజుకు రాజ్యలక్ష్మికి కలిసొచ్చిన అదృష్టం. ఆయన భార్య, వైసీపీ అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి ఉపాధ్యాయురాలు కావడంతో వివాదాలకు దూరంగా ఉన్నారు. ఎన్నికల సమయం కాబట్టి ఆమె కుల ధ్రువీకరణ వివాదమైంది. తన భర్తను కాదని వైసీపీ అధిష్ఠానం ఆమెనుధ .రంగంలోకి దింపినా ఏమాత్రం తత్తరపడకుండా కార్యరంగంలోకి దిగారు. పోలవరం నియోజకవర్గ పరిధిలోని ఏడు మండలాల్లో విస్తృతంగా తిరిగారు. గిరిజన కుటుంబాలతో మాటామంతి కలిపారు. ప్రత్యేకించి మహిళల నుంచి ఫ్లస్‌మార్క్ వచ్చేలా జాగ్రత్తలు పడ్డారు. ఆరోపణలు, విమర్శలకు తావు లేకుండా ప్రతి విషయాన్ని జాగ్రత్తగా పరిశీలించిన తరువాతే అడుగులు వేయడం రాజ్యలక్ష్మికి కలిసొచ్చినట్లు అయింది. తన భర్త ఎమ్మెల్యేగా ఉన్న తరుణంలో పోలవరం ముంపు బాధితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీలో నష్టం వాటిల్లడం, మరికొందరికి అర్హత ఉన్నా జాబితాలో చోటు దక్కకపోవడం వంటి అంశాలు ప్రతికూలమే. ఇలాంటి తరుణంలోనే భర్తకు బదులుగా తాను రంగంలోకి దిగడం, పార్టీపరంగా అసంతృప్తుల నుంచి కూడా సహకారం పొందేందుకు కష్టపడాల్సి వచ్చింది. తన భర్తపై ఉన్న వ్యతిరేకత రాజ్యలక్ష్మికి విజయాన్ని దూరం చేస్తుందా? లేక మహిళా అభ్యర్థిగా చోటు కల్పిస్తుందా? అనేది ఇప్పుడు పోలవరం రాజకీయాల చుట్టూ తిరుగుతోంది.


మై డియర్ ఫస్ట్ టైం ఓటర్..



యువ ఓటర్లకు నారా లోకేశ్ లేఖ

తొలిసారి ఓటు హక్కు పొందిన యువతీ యువకులకు ప్రత్యేక శుభాకాంక్షలు అంటూ తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ లేఖ రాశారు. ఉండి నియోజకవర్గంలోని పలువురు గ్రాడ్యుయేట్లకు శనివారం లేఖలు అందాయి. అమరావతి నుంచి లోకేశ్ యువ ఓటర్ల అడ్రస్‌కు లేఖ రాసి పంపించారు. గ్రామంలో పోస్ట్‌మన్ వీటిని బట్వాడా చేశారు. లేఖ తెరిచి చూసిన యువ ఓటర్లు ఒక్కసారిగా సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు తనయుడు లోకేశ్ నుంచి లెటర్ వచ్చిందని తెలుసుకున్న నూతన ఓటర్లు సంబరపడిపోయారు. లేఖలో లోకేశ్ పలు అంశాలు ప్రస్తావించారు. ఓటు ద్వారా సరైన నాయకుడిని, ప్రభుత్వాన్ని ఎన్నుకుంటే మీ భవిష్యత్‌కు పునాది అని పేర్కొన్నారు. ఐదేళ్లలో యువతకు కలిగిన నష్టాన్ని వివరించారు. ఓటు హక్కు వినియోగించుకుని సరైన ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని సూచించారు. తమను గుర్తించి శుభాకాంక్షలు తెలిపిన పార్టీకే తమ ఓట్లు వేసి గెలిపిస్తామని నూతన ఓటర్లు పేర్కొన్నారు. లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. - ఉండి

నిమ్మలకు 25 వేల మెజారిటీ!



పందెం ఒప్పంద పత్రం

పాలకొల్లులో జోరుగా పందేలు

సిట్టింగ్ ఎమ్మెల్యే, కూటమి అభ్యర్థి నిమ్మల రామానాయుడు విజయం సాధించడమే కాదు మెజార్టీపై జోరుగా పందేలు సాగుతున్నాయి. 2014 ఎన్నికల్లో టీడీపీ ఎమ్మెల్యేగా గెలుపొందిన నిమ్మల ఐదేళ్లలో నియోజక వర్గంలో విశేష అభివృద్ధి చేశారు. 2019లో రాష్ట్రంలో టీడీపీ అధికారం చేజారినప్పటికీ నిమ్మల రెండోసారి అధిక మెజార్టీతో గెలుపొందారు. పార్టీ అధికారంలో లేకపోవడంతో గడచిన ఐదేళ్లలో నియోజకవర్గ అభివృద్ధి కుంటుపడింది. ఈ పరిస్థితుల్లో నిమ్మల మూడోసారి కూటమి అభ్యర్థిగా బరిలో దిగారు. ఆయన గెలుపు సాధ్యమేనని పరిశీలకులు అంచనా వేస్తున్నారు. ఇప్పుడు నిమ్మల సాధించే మెజారిటీపై ఆసక్తి నెలకొంది. 25 వేల ఓట్లకు పైబడి మెజార్టీ వస్తుందని, పందేలు సాగాయి. ఈ మేరకు పందెం రాయుళ్ల లిఖితపూర్వక ఒప్పందం చేసుకుంటున్నారు. ఈ పరిణామాలతో వైసీపీ శిబిరంలో నిరాశ, నిస్పృహలు కనిపిస్తున్నాయి.

- పాలకొల్లు

నమ్మకస్తుల కోసం వేట..



ప్రచార గడువు ముగియడంతో నగదు పంపిణీ కీలకం. అత్యంత నమ్మకమైన వారికోసం నాయకులు ఆరా తీస్తున్నారు. గత ఎన్నికల్లో పనిచేసిన వారి గూర్చి ఆరా తీస్తున్నారు. డబ్బులు నొక్కేస్తారనుకున్న వారిని దూరం పెడుతున్నాయి. ప్రాంతాలవారీగా పంపిణీ చేయాల్సిన మొత్తంపై లెక్కలు వేయడంలో తలమునకలుగా ఉన్నారు. ఓటర్లు అందరికి ఒకేతీరిగా కాకుండా కేటగిరిల వారిగా విభజించి పంచాలని వారు భావిస్తున్నట్లు సమాచారం. కచ్చితంగా తమకు అనుకూలం.. డబ్బులిస్తేనే ఓటేస్తారనుకునే వారు.. ప్రత్యర్థిపార్టీ అభ్యర్థికి ఓటువేస్తారనుకునే వారు.. ఇలా ఎవరెవరు ఉంటారనే కోణంలో అభ్యర్థులు లెక్కలతో కుస్తీ పడుతున్నారు. ఇప్పటికే కొన్ని చోట్ల పంపిణీ ప్రారంభమైంది. తమ చేతిలో ఇన్ని ఓట్లు ఉన్నాయంటూ బేరాలకు దిగుతున్నారు. ఎవరిని నమ్మాలో, ఎవరిని నమ్మకూడదో ముఖ్య నేతలు తెలియక తలపట్టుకుంటున్నారు.

ఒట్టు పెట్టి ఓటేయాలి..



ఎన్నికల్లో ఎలాగైనా గెలిచేందుకు నాయకులు జిమ్మిక్కులు చేస్తున్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తున్నారు. వలసవెళ్ళిన ప్రతి కుటుంబాన్ని జిల్లాకు రప్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. హైదరాబాద్, విజయవాడ, రాజమండ్రి, విశాఖ వంటి నగరాల్లో పనిచేసే వారిని ఓట్లు వేసేందుకు పిలుస్తున్నారు. ఇందుకు తగ్గట్టుగా వారికి ప్రయాణ ఖర్చులు అంటూ ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా డబ్బులు పంపిస్తున్నారు. ఓటువేసిన వారు ప్రమాణం చేస్తే రానుపోను టిక్కెట్లే కాకుండా ఆ రోజు ఇతరత్రా ఖర్చులు కూడా తామే ఇచ్చుకుంటామని చెప్పుకొస్తున్నారు. కొంతమంది మీ డబ్బులు, మీ టిక్కెట్ వద్దు ప్రజాస్వామ్యంగా మా ఓటును వినియోగించుకుంటామని అధికార పార్టీ నేతలకు చెప్పడంతో కంగుతింటున్నారు. ఓటర్లకు మద్యం, డబ్బు పంపిణీకి కూడా తెరతీశారు. - ఏలూరు రూరల్

ఓటెవరికేస్తారో..!



పోలింగ్ దగ్గర పడుతున్న కొద్ది ఓటర్లు గుంభనంగా వ్యవహరిస్తున్నారు. ఓటు ఎవరికి వేస్తారో తెలియక నేతలు తలలు పట్టుకుంటున్నారు. అభ్యర్థులు, నాయకులు ప్రచారానికి వచ్చినప్పుడు ఆర్భాటం చేసి అత్యుత్సాహం ప్రదర్శించే కార్యకర్తలు, ఓటర్లు పోలింగ్‌కు సమయం ముంచుకొస్తున్న తరుణంలో పల్లెల్లో నిశ్శబ్ద వాతావరణం నెలకొంది. ఎవరు ఏ పార్టీకి మొగ్గు చూపుతారో, తమ కెంత మెజార్టీ వస్తుందో కూడ నాయకులు అంచనా వేయడం కష్టమే. ఒక్కో గ్రామం చూస్తే అసలు ఇది ఎన్నికల సమయమేనా అనిపిస్తుంది. ఊళ్లన్నీ గప్‌చుప్‌గా ఉన్నాయి. కార్యకర్తల హడావుడి తప్ప ఓటర్ల నాడి పట్టులేకపోతున్నారు. - ముదినేపల్లి

అక్కడ పరిస్థితి ఏంటి..?



ఎన్నికలపై విదేశాల్లో ఉంటున్న ప్రవాసాంధ్రులలో ఆసక్తి నెలకొంది. రాష్ట్రం, సొంత ప్రాంతాల్లో ఎన్నికల పరిస్థితి, జయపజయాలు, ప్రచారాల సరళిపై ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నారు. స్థానికంగా ఉండే కుటుంబ సభ్యులు, బంధులకు రోజూ ఫోన్ చేసి సమాచారం తెలుసుకుంటున్నారు. ప్రధానంగా గల్ఫ్ దేశాలకు ఉపాధి కోసం వెళ్ళిన కార్మికులతో పాటు ప్రవాసాంధ్రుల్లో చర్చనీయాంశమైంది. అమెరికా, జర్మని, నెదర్లాండ్ తదితర దేశాల్లో ఉన్న మన ప్రవాసాంధ్రులు ఇక్కడ జరుగుతున్న ఎన్నికలపై ఎంతో ఆసక్తిగా అడిగి తెలుసుకుంటున్నారని బంధువులు చెబుతున్నారు. ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల ప్రచార సరళిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారు. తమకు అనుకూలమైన అభ్యర్థులకు మద్దతుగా ప్రవాసాంధ్రులు సోషల్ మీడియా ద్వారా కూడా ప్రచారం చేస్తున్నారు. - గణపవరం

వద్దన్నా ఎన్నికల విధులు.. గుండెపోటుతో ఉపాధ్యాయుడి మృతి



సుబ్బరాజు (ఫైల్)

పెరవలి, మే 10: ఎన్నికల విధుల ఒత్తిడి తట్టుకోలేక పెరవలి నెం.1 పాఠశాల ఉపాధ్యాయుడు గుండెపోటుతో మృతి చెందాడు. తూర్పుగోదావరి జిల్లా పెరవలి గ్రామానికి చెందిన కొలనువాడ సుబ్బరాజు(59) దివ్యాంగుడు. 25 ఏళ్లుగా ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. అతడికి అధికారులు ఎన్నికల డ్యూటీ వేశారు. తనకు ఆరోగ్యం బాగోలేదని, డ్యూటీ నుంచి మినహాయించాలని జిల్లా అధికారుల చుట్టూ తిరిగినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. అతని అభ్యర్థనను జిల్లా అధికారులు పట్టించుకోకపోవడంతో ఒత్తిడికి గురై శనివారం గుండెపోటుతో మృతి చెందినట్టు కుటుంబసభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు.

పోలవరం సెంటిమెంట్

ఇక్కడ గెలిచిన పార్టీదే అధికారం

పోలవరం నియోజకవర్గంలో ఒక సెంటిమెంట్ ఉంది. సార్వత్రిక ఎన్నికల్లో 1983 నుంచి ఇక్కడ ఏ పార్టీ అభ్యర్థి గెలిస్తే ఆ పార్టీయే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుంది. 1983 నుంచి 2019 వరకు ఇదే విధానం కొనసాగుతుండడంతో నియోజకవర్గంలో నాయకులు, కార్యకర్తలు పోలవరాన్ని సెంటిమెంట్ భావిస్తారు. 1983లో మొడియం లక్ష్మణరావు టీడీపీ నుంచి గెలుపొందారు. ఎన్‌టీఆర్ ముఖ్యమంత్రిగా ప్రభుత్వం ఏర్పాటు చేశారు. 1989లో కాంగ్రెస్ అభ్యర్థి బాడిస దుర్గారావు గెలుపొందారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైంది. 1994, 1999లో టీడీపీ ఎమ్మెల్యేలు గెలుపొందడంతో టీడీపీ ప్రభుత్వం ఏర్పాటైంది. 2004, 2009లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా తెల్లం బాలరాజు గెలుపొంది కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటైంది. 2014లో టీడీపీ ఎమ్మెల్యేగా మొడియం శ్రీనివాస్ గెలుపొంది, టీడీపీ ప్రభుత్వం ఏర్పాటైంది. 2019లో తెల్లం బాలరాజు గెలుపొంది వైసీపీ ప్రభుత్వం ఏర్పాటైంది. దీంతో ప్రస్తుత ఎన్నికల్లో ఎవరు గెలిస్తే ఆ పార్టీనే అధికారంలోకి వస్తుందని నియోజకవర్గంలో నాయకులు చర్చించుకుంటున్నారు. - కొయ్యలగూడెం



ఆహా.. ఆర్టీసీలో ఉచిత ప్రయాణం

జిల్లాలో ప్రయాణించే మహిళలకు ఉచితంగా టికెట్టు లేకుండా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే సౌకర్యాన్ని కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే ఖరారు చెయ్యనున్నారు. ప్రతీ సభలోను చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు ఈ విషయాన్ని ప్రస్తావిస్తున్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళల ప్రయాణం ఎక్కువగానే ఉంటోంది.ఇప్పటికే తెలంగాణ, కర్ణాటకలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమల్లో ఉంది. పూర్వపు పశ్చిమ గోదావరి జిల్లాలో ఏలూరు, భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం, జంగారెడ్డిగూడెం, నరసాపురం, కొవ్వూరు, నిడదవోలు డిపోలు ఉన్నాయి. మొత్తం 500 వరకు బస్సులు ఉన్నాయి. ఉచిత బస్సు ప్రయాణంపై మహిళల్లో ఆసక్తికర చర్చ జరుగుతోంది. చాలా ప్రాంతాల నుంచి మహిళలు ప్రైవేట్ సంస్థల్లో, ప్రభుత్వం ఉద్యోగాలు చేసుకుంటున్నారు. ఈ పథకం అమలులోకి వస్తే ఇలాంటి వారందరికీ ఆర్థికంగా కొంత వెసులుబాటు కలుగుతుంది.

-భీమవరం టౌన్

ఈ పథకం..మహిళలకు వరం



మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం ఒక వరంగా చెప్పవచ్చు. చంద్రబాబు అధికారంలో ఉన్న సమయంలో ప్రతీ పథకంలోను మహిళలకు ప్రాధాన్యం కల్పించారు.ఈ పథకం వల్ల పేద మధ్య తరగతి మహిళలకు ప్రయోజనం కలుగుతుంది.

- వేలూరి సీతామహాలక్ష్మి, భీమవరం

చిరు మహిళా ఉద్యోగులకు ఊరట



ఎంతో మంది మహిళలు ప్రైవేట్ సంస్థలల్లో ఉద్యోగాలు చేసుకుంటున్నారు. ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే పెరిగిన ఛార్జీల కారణంగా దారి ఖర్చులు భారంగా మారాయి. ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం అలాంటివారికి ఆర్థికంగా ఊరట కలిగిస్తుంది.

- శనగవరపు అన్నపూర్ణ, గునుపూడి

వంటింట్లో సంబరాలు



మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితం

ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితం హామీ మహిళలను విశేషంగా ఆకర్షించింది. ఈ పథకం వల్ల ఎంతో ప్రయోజనం చేకూరుతుందని మహిళలే చెబుతున్నారు. ఒక చిన్న కుటుంబం అయితే ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు పొదుపుగా వాడుకుంటే సరిపోతాయి, ఒక వేళ అవసరమైతే ఒకటి , రెండు సిలిండర్లు ఏడాదికి అదనంగా కొనుగోలు చేస్తే సరిపోతుంది.. గ్యాస్ సిలిండర్ ధరలు విపరీతంగా పెరిగాయి. మొన్నటివరకు రూ.1100 పైగా పెట్టి కొనుగోలు చేయాల్సి వచ్చేదని, పేద, మధ్య తరగతికి ఇది భారమేనని ఉచిత సిలిండర్ల పథకం వల్ల ఆర్థికంగా చాలా భారం తగ్గుతుందని చెబుతున్నారు. మహిళలు ఈ పథకం పట్ల ఆకర్షితులవు తున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో గ్యాస్ వినియోగ దారులు 12.90 లక్షల మంది వరకు ఉన్నారు. ఇవిగాక 6 వేలు వరకు ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. ఏలూరు జిల్లాలో మొత్తం గ్యాస్ కనెక్షన్లు 6.54 లక్షల వరకు ఉండగా ఇవిగాక 3,757 ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. టీడీపీ అధికారంలోకి వస్తే ఈ ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం ద్వారా వీరందరికీ ప్రయోజనం చేకూరే అవకాశాలున్నాయి.

-ఏలూరు సిటీ

మహిళలకు ఎంతో లబ్ధి



అన్నింటి ధరలు పెరిగి ఇబ్బందులు పడుతున్న తరుణంలో ఏడాదిలో ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు ఇవ్వడం సంతోషించదగ్గ విషయం. పెరిగిన గ్యాస్ సిలిండర్ల ధరలతో ఇబ్బంది పడుతున్న సమయంలో ఇటువంటి పథకం చాలా ఉపయోగకరంగా ఉంటుంది.

- కొడాలి హిమబిందు, ఏలూరు

ఉచిత గ్యాస్‌తో ఆర్థికంగా మేలు



ఏటా మూడు వంటగ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తామని చంద్ర బాబు ప్రకటించటం ఆనందంగా ఉంది. మాలాంటి పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఊరట. ప్రస్తుతం వంట గ్యాస్ ధరలు పెరుగుతుండటం వల్ల కట్టెల పొయ్యిపైనే వండుకుంటున్నాం.

- కాళ్ళ శ్రీదేవి, ఏలూరు

ఎన్నికలకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు


జిల్లాకు చేరుకున్న కేంద్ర బలగాలు, నాగాలాండ్, తమిళనాడు పోలీసు బలగాలు



కలపర్రు టోల్‌గేటు వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న ట్రైనీ ఐపీఎస్ అధికారులు

ఏలూరు క్రైం, మే 11 :జిల్లాలో ఎన్నికలు శాంతియుతంగా, సజావుగా సాగేందుకు శాంతి భద్రతలు కాపాడేందుకు ఏలూరు ఎస్పీ మేరీ ప్రశాంతి ఆధ్వర్యంలో పోలీసులు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేశారు. శాంతి భద్రతలను పర్యవేక్షించేందుకు ఎన్నికల సంఘం ఐపీఎస్ అధికారులను జిల్లాకు ఎన్నికలు పరిశీల కులుగా పంపించింది.వారు ఇప్పటికే జిల్లాలో గతంలో జరిగిన ఎన్నికల పరిస్థితులను అధ్యయనం చేశారు. ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసిన వారంలోనే కేంద్ర బలగాలు జిల్లాకు చేరుకున్నాయి. ఎన్నికలు సోమవారం జరగనున్న దృష్ట్యా తమిళనాడు రాష్ట్రం నుంచి ప్రత్యేకంగా అక్కడ రిజర్వు పోలీసులు, లా అండ్ ఆర్డర్ పోలీసులు శుక్రవారం రాత్రి చేరుకున్నారు. ఇప్పటికే నాగాలాండ్‌కు చెందిన ప్రత్యేక బెటాలియన్లు ప్రతి నియోజకవర్గానికి వచ్చేశాయి. అదనపు బలగాలు శనివారం వేకువ జామున చేరుకున్నాయి. జిల్లాకు వచ్చిన 9 మంది ట్రైనీ ఐపీఎస్ అధికారులు శనివారం కలపర్రు టోల్‌గేటు వద్ద వాహనాలను తనిఖీలు చేశారు. ఆదివారం ఉదయం ఈవీఎం బాక్స్‌లు తీసుకువెళ్లే ప్రక్రియ నుంచి వాటిని తిరిగి లెక్కింపు కేంద్రాలకు అప్పగించే వరకు నాగాలాండ్ బృందాలతో కట్టుదిట్ట భద్రత చేపట్టారు.

సూపర్‌సిక్స్ పథకాలే సూపర్ అనుకుంటే టీడీపీ కూటమి ఎన్నికల మేనిఫెస్టో అదుర్స్ అంటూ అన్నివర్గాల ప్రజల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. సంక్షేమం, అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా పేద, మధ్య తరగతి వర్గాలకు మేలు చేకూర్చేలా పథకాలు ఉన్నాయని అభినందిస్తున్నారు. నూతనోత్సాహం నింపిందని మహిళలు వ్యాఖ్యానిస్తున్నారు. పింఛన్లు పెంపు, పేదలందరికి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో స్థలాలు, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, బాలికల విద్యకోసం కలలకు రెక్కలు, ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, బీసీలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించటం వంటి అంశాలపై సంతోషం వ్యక్తమవుతోంది. మహిళలు, రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులు ఇలా అందరూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ఉమ్మడి మేనిఫెస్టోతో ఇక జగన్ భవిష్యత్తు గల్లంతు అవుతుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.





టీడీపీ మేనిఫెస్టో, సూపర్‌సిక్స్ పథకాలపై అన్ని వర్గాల్లో ఆనందం

అవ్వా, తాతలకు ఆనందమే

నాలుగు వేల పింఛన్ గ్యారంటీ



ప్రతీ నెలా వచ్చే పింఛన్‌పైనే ఆశలు పెట్టుకున్న అవ్వా తాతలకు కూటమి రూ.4 వేల పింఛన్ ఇస్తుందన్న హామీతో కొండంత బలం పెరిగినట్టయింది. గత ప్రభుత్వం మాదిరిగా ఏడాదికోసారి పెంచి ఇవ్వడం కాకుండా ఏప్రిల్ నెల నుంచే పెంచి ఇస్తానని ప్రకటించారు. దీంతో జూన్ నెలలో రూ.6 వేలు తీసుకునేందుకు ఆనందంగా ఎదురు చూస్తున్నారు. సమాజంలో అణగారిన వర్గంగా ఉన్న బీసీలకు 50 సంవత్సరాలకే పింఛన్ అందించే హామీతో 50 ఏళ్ల పైబడిన వారంతా పింఛన్ అందుకుంటామన్న ఆనందంలో కూటమి గెలుపుకోసం ఎదురు చూస్తున్నారు. ఇప్పటి వరకూ ఏనెల పింఛన్ నెలే తీసుకోవాలన్న నిబంధన ఇతర ప్రాంతాల్లో కొడుకు, కూతుళ్ల దగ్గర ఉండే అవ్వా తాతలు, బతుకు తెరువుకోసం పనిచేసేందుకు హైదరాబాద్ వంటి ప్రాం తాల్లో ఉండే ఒంటరి మహిళలకు ఇబ్బంది కరంగా ఉండేది. కూటమి అధికారం లోకి వచ్చిన తర్వాత ఇలాంటి వారు మూడు నెలల పింఛన్ ఒకేసారి తీసుకోవచ్చనే వెసులుబాటు కొండంత ధైర్యాన్ని ఇచ్చింది. పశ్చిమ గోదావరి జిల్లాలో 2 లక్షల 34 వేల మంది పింఛన్ దారులు ఉండగా ఉమ్మడి జిల్లాతో కలిపి 5 లక్షల మంది పింఛన్ దారులు ప్రభుత్వం అందించే పింఛన్ కోసం ఎదురు చూస్తున్నారు.

-తాడేపల్లిగూడెం రూరల్

పింఛనే ఆధారం..



పింఛన్‌తోనే బతుకుతున్నాం. అలాంటిది గత ఎన్నికల్లో మూడు వేలు పింఛన్ పెంచుతానని చెప్పి ఐదేళ్లలో కొంచెం కొంచెం పెంచి మా ఆశలపై జగన్ నీళ్ల చల్లాడు. చంద్రబాబు నాలుగు వేలు పింఛన్ ఏప్రిల్ నుంచే ఇస్తాననడం ఆనందంగా ఉంది.

బి.నరసమ్మ, నందమూరు

కూటమిని నెగ్గించుకుంటాం



పింఛన్లే మాకు జీవనోపాధి. ఒక్కసారిగా రూ.4 వేలు అందిస్తాననడం ఆనందంగా ఉంది. కూటమిని నెగ్గించుకునే బాధ్యత మేం తీసుకుంటాం. ఇచ్చిన హామీలు నెరవేర్చే బాధ్యత కూటమి నాయకులు తీసుకోవాలి.

-అడపా రామారావు, తాడేపల్లిగూడెం

సన్న, చిన్నకారు రైతులకు చేయూత

రైతులకు ఏటా రూ.20 వేలు



ఏడాదికి రూ.20 వేలు రైతన్నలకు అందించాలనే నిర్ణయం రైతులకు చేయుతగా నిలుస్తుంది. సన్న, చిన్నకారు రైతులకు పెట్టుబడులకు ఆసరాగా ఉంటుంది. కౌలు రైతులకు గతంలో మాదిరిగా చేయుతనిచ్చేలా నిర్ణయం తీసుకోవడంపై హర్షం వ్యక్తం అవుతోంది. ఉమ్మడి జిల్లాలలో 2 లక్షల పైగా రైతులకు రూ.300 కోట్లు వరకు రైతులు లబ్ధి పొందే అవకాశం ఉంది. వైసీపీ ప్రభుత్వం హయంలో రైతు భరోసా కింద వైసీపీ ప్రభుత్వం రూ.7500, కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ కింద రూ. 6 వేలు మొత్తం రూ.13,500 ఇచ్చేవారు. తెలుగుదేశం కూటమి ప్రణాళిక ప్రకారం రూ.20 వేలు అందిస్తామని చెప్పడం రైతుల్లో ఒక ధీమాను కలిగిస్తోంది. వైసీపీ ప్రభుత్వంలో ధాన్యం అమ్మకాలు, సాగు పరంగా చాలా ఇబ్బందులు పడ్డామని దీంతో కూటమి పార్టీ కోసం ఎదురు చూస్తున్నామని అంటున్నారు.

- భీమవరం రూరల్

సాగులో పెట్టుబడులకు ఆసరా



వరిసాగులో ప్రస్తుతం చేయుత చాలా అవసరం. ఇలాంటి తరుణంలో తెలుగుదేశం కూటమి ఏటా రూ.20 వేలు చేయుతగా ఇవ్వాలని నిర్ణయించడం రైతులకు మంచిదే. పెట్టుబడికి రైతులకు చేయూతనిచ్చినట్లవుతుంది.

-కోమటి రాంబాబు, భీమవరం మండలం రైతు

ప్రోత్సాహకరంగా ఉంటుంది



వరిసాగులో రైతన్నలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ప్రకృతి కన్నెర్ర కారణంగా సాగులో వెనుకబడ్డారు. ఇలాంటి తరుణంలో తెలుగుదేశం కూటమి ఏటా రూ.20 వేలు ఇవ్వాలనే నిర్ణయం చాలా మంచిది. సాగులో మరింత ముందుకు సాగించేలా ప్రోత్సాహం అందించినట్టవుతుంది.

- తోట నాగభూషణం, భీమవరం మండలం రైతు

కుటుంబ చదువుకు పూర్తి భరోసా

ఎంతమంది పిల్లలున్నా ఏడాదికి రూ.15 వేలు



తల్లికి వందనం మాట ప్రతీ కుటుంబంలోను చల్లని కబురులా మారింది. కుటుంబంలోని పిల్లలందరికి.. ఒకరు.. ఇద్దరు.. ముగ్గురున్నా ఒక్కొక్కరికి రూ.15 వేలు ఇవ్వనున్నది. ఇది కుటుంబ చదువుకు భరోసాగా నిలుస్తుందని మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 4 లక్షల మందికిపైగా విద్యార్థులకు ఏటా రూ.500 కోట్లు రూపాయిలకు పైగా లబ్ధి చేకూరే అవకాశం ఉంది. ప్రతీ కుటుంబంలోని తల్లితండ్రులకు వారి పిల్లల అందరికి చదువు నిమిత్తం చేయూత లభించిందనే ఆనందం లభిస్తుందని తల్లితండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో కుటుంబంలో ఒకరికి మాత్రమే రూ.15 వేలు ఇస్తామని రూ.13 వేలే ఇవ్వడంతో వారిలో నిరుత్సాహం అలముకుంది. ఇద్దరు పిల్లలు ఉంటే ఒకరికే రావడం తల్లితండ్రులు ఏం చేయాలనే ఆలోచనలో పడేసింది. కూటమి నిర్ణయం ఇప్పుడు పిల్లల చదువుకు భరోసాగా ఉంటుందని అంటున్నారు.

-భీమవరం రూరల్

ఉన్నత చదువులకు ఆసరా



ఇప్పుడు పిల్లలకు మంచి భవిష్యత్ ఇవ్వాలంటే బాగా చదివించాలి. చదువు కోసమే ఇప్పుడు చాలా ఖర్చు అవుతోంది. ఏటా కుటుంబంలోని పిల్లలందరికి రూ.15 వేలు ఇవ్వాలని నిర్ణయించడం మంచి నిర్ణయం. తల్లితండ్రులకు ఇది ఎంతో ఆనందాన్ని ఇచ్చే పథకం.

-పి.నాగేశ్వరరావు, భీమవరం మండలం

ఇది మంచి నిర్ణయం



ప్రతీ పిల్లవాడికి చదువుకు రూ.15 వేలు ఇవ్వడం పిల్లల భవిష్యత్‌కు పునాది వేసినట్లవుతుంది. కుటుంబంలో పిల్లలు అందరూ చదువుకోవాలని తల్లితండ్రులు అనుకుంటారు. అలా చదువుకునే అవకాశం తెలుగుదేశం కూటమి ద్వారా కలుగుతుంది. ఇది మంచి నిర్ణయం.

-ఎల్. ఇస్సాకు, భీమవరం మండలం

యువత భవిష్యత్తు.. బంగారం



కూటమి ప్రభుత్వం ఏర్పడితే యువత జీవితం బంగారమవుతుందని నిరుద్యోగ యువత అభిప్రాయ పడుతు న్నారు. టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోలో 20 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి కింద రూ.3 వేలు ప్రకటించటం పట్ల యువత సంతోషం వ్యక్తం చేస్తోంది. వారు తెలుగుదేశం పార్టీ వైపు ఆకర్షితులవుతున్నారు. గత ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయక పోవడంతో తమ చదువుకి సరిపడా ఉద్యోగం దొరక్క యువత తీవ్ర నిరాశకు గురైంది. ప్రతి ఏడాది ఏలూరు జిల్లాలో డిగ్రీ పాసైన వారు 4,500 మంది ఇంజినీరింగ్ పూర్తిచేసిన 3 వేలమంది బయటకు వస్తున్నారు. బయటకు వచ్చిన అనంతరం వీరిలో కొంతమంది ఉన్నత విద్య అభ్యసిస్తున్నా మిగతా వారు 40 శాతం మంది ప్రైవేట్ ఉద్యో గాలు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. గత తెలుగుదేశం హయాంలో నిరుద్యోగ భృతి రూ. 3 వేలు ఇచ్చింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కనీసం ఉద్యోగ కల్పన అవకాశాలు చేపట్టకపోగా, నిరుద్యోగ భృతికూడా ఇవ్వలేదు. తల్లిదండ్రులకు భారం అవ్వకూడదని చిన్నా చితక ఉద్యోగాలు చేస్తూ ముందుకు సాగు తున్నారు. తెలుగుదేశంపార్టీ అధికారంలోకి వస్తే తమ విద్యకు తగ్గ ఉద్యోగం లభిస్తుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు.

- ఏలూరు రూరల్

గత ప్రభుత్వం మోసం చేసింది



గత ప్రభుత్వం నిరుద్యోగులను జాబ్ క్యాలెండర్ పేరిట మోసం చేసింది. కూటమి మేనిఫెస్టో బావుంది. నిరుద్యోగ యువతకు రూ.3 వేలు భృతి హామీ ఇవ్వడం హర్షణీయం. ఉద్యోగ అవకాశాలు కల్పించేలా భరోసా ఇవ్వడం ఆనందమే.

-కటకం మణికంఠ, ఏలూరు

విద్యకు తగ్గ ఉద్యోగం వస్తుందనే నమ్మకం



ప్రభుత్వపరంగా ఉన్నత ఉద్యోగాన్ని ఆశించినా గత ఐదేళ్లుగా జాబ్ క్యాలెండర్‌ను ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో తీవ్ర నిరుత్సాహానికి గురయ్యాం. టీడీపీ 20 లక్షల ఉద్యోగాల కల్పన, నిరుద్యోగ భృతిపై హామీ చాలా బావుంది. విద్యకు తగ్గ ఉద్యోగం లభిస్తుందనే నమ్మకం వచ్చింది.

- నాయుడు శ్రీను, నూజివీడు

భవిష్యత్తుపై ఆశలు చిగురించాయి



గత ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ విడుదల చేయకపోవడంతో ఎప్పటికప్పుడు నిరుత్సాహపడ్డాం. చివరికి ఉద్యోగాల కోసం ఇతర రాష్ట్రాలకు వలసపోవాలని అనుకుంటున్నాం. టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోలో నిరుద్యోగ భృతి రూ.3వేలు, 20 లక్షల ఉద్యోగాల కల్పన ప్రకటించడం ఆశాజనకంగా ఉంది.

- వంగమూరి ఆనంద్, మర్రిబంధం, నూజివీడు

దివ్యాంగులకు ఊతం



కూటమి మేనిఫెస్టోపై దివ్యాంగుల్లో సంతోషం వ్యక్తమవుతోంది. రూ.6 వేలు పింఛన్ అందజేస్తామని ప్రకటించడం పట్ల ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 10 లక్షల మందికి పైగా దివ్యాంగులు ఉన్నారు. గత టీడీపీ హయాంలో రూ.1500 నుంచి రూ. 3 వేలు పింఛన్ పెంచింది. అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం అదే రూ.3 వేలు అందజేసిందే తప్ప వృద్ధులు, దివ్యాంగులను ఆదుకోలేదు. ఏలూరు జిల్లాలో సుమారు మూడు వేలమందికి పైగా దివ్యాంగులు పింఛన్ పొందుతున్నారు. ఇంతకు మించి సదుపాయాలు కాని, ఉద్యోగ అవకాశాలు కాని అందించిన పాపాన పోలేదు. కొద్దిమందికి మాత్రమే బ్యాటరీ సైకిళ్ళు, వాహనాలు అందజేశారు. టీడీపీ హయాంలో ప్రతి ఏడాది అర్హులైన అందరికి వీల్ చైర్లు, బ్యాటరీ వాహనాలు అందజేశారు. ఉపాధికి చేయూత అందించారు. ప్రస్తుతం మేనిఫెస్టోలో దివ్యాంగులకు రూ.6 వేల నుంచి రూ.10 వేల వరకు అందిస్తామని ప్రకటించడంపై వారంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ మేనిఫెస్టో పోలిస్తే అందరికి ప్రయోజనం చేకూర్చే విధంగా ఉంది.

- ఏలూరు రూరల్

రాష్ట్రాభివృద్ధికి పెద్దపీట



కూటమి ప్రభుత్వం ఏర్పడితే యువత జీవితం బంగారమ వుతుంది. రాష్ట్రానికి పరిశ్రమలు వస్తాయి. ఉపాధి, ఉద్యోగ కల్పన పెరుగుతుంది. గత ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ పేరిట మోసం చేసింది. దివ్యాంగులకు రూ.6 వేలు ప్రకటించటం హర్షణీయం. రాష్ట్రాభివృద్ధికి మేనిఫెస్టో పెద్దపీట వేసింది. పూర్ టూ రిచ్ అమలుకు 24 పథకాలను అమలు చేయటానికి సంకల్పించడం, ఉద్యోగాల కల్పన వల్ల గ్రోత్ రేటు పెరుగుతుంది.

- చెల్లా జాకబ్, విభిన్న ప్రతిభావంతుడు

వచ్చేస్తున్నాం..!

ఓట్ల పండుగ కోసం పయనమైన ఎన్ఆర్ఐలు, ఇతర రాష్ట్రాల వాసులు

ఎక్కడికక్కడ ట్రాఫిక్ జామ్‌లు

బస్సులు, ట్రైన్ టిక్కెట్లకు డిమాండ్



ఏలూరుసిటీ, మే 11: ఓట్ల పండుగకు ఒక్కరోజు మాత్రమే సమయం ఉంది. ఇప్పటికే విదేశాల్లో ఉన్న ఎన్ఆర్ఐలు ఓటు వేయడం కోసం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు విచ్చేశారు. అలాగే హైద్రాబాద్, బెంగుళూరు సిటీలతో పాటు ఇతర రాష్ట్రాలలో నివసిస్తున్న ఈ ప్రాంత వాసులు అక్కడి నుంచి బయలు దేరడంతో టోల్‌గేట్‌ల వద్ద ట్రాఫిక్ జామ్ అవుతోంది. వందలాది వాహనాలు ఒకేసారి వస్తుండటంతో ఎక్కడి చూసినా కార్లు, ప్రైవేటు వాహనాలు, ప్రైవేటు బస్సులు, ఆర్టీసీ బస్సుల రద్దీ విపరీతంగా పెరిగింది. ఈనెల 13 వ తేదీన రాష్ట్రంలోని వివిధ నియోజకవర్గాలలో తమ ఓటు హక్కు వినియోగించుకోవటానికి వారు ఈ ప్రాంతానికి వస్తున్నారు. ఇప్పటికే తెలంగాణ రాష్ట్రం నుంచి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు వచ్చేవారికోసం తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక బస్ సర్వీసులు ఏర్పాటు చేసింది. అలాగే దక్షిణ మధ్య రైల్వే వారు కూడా ప్రత్యేక రైళ్ళను ఈ ప్రాంతం మీదుగా నడుపుతున్నారు. ఇప్పటికే రాష్ట్రానికి వస్తున్న ప్రయాణికులతో బస్, ట్రైన్ టిక్కెట్లకు విపరీతమైన డిమాండ్ పెరిగింది. ఒక్క సారిగా ప్రైవేటు ఆపరేటర్లు ధరలను కూడా పెంచేశారు. గత రెండు రోజులుగా పెదపాడు టోల్‌గేట్ వద్ద విపరీతమైన రద్దీ పెరిగింది. ముఖ్యంగా శనివారం ఉదయం నుంచి వందలాది వాహనాలు ఈ ప్రాంతానికి వస్తుంటంతో ఎక్కడి కక్కడ ట్రాఫిక్ జామ్ అవుతోందని చెబుతున్నారు. ఒక్క హైద్రాబాద్‌లోనే లక్షలాది మంది ఓటర్లకు ఈ ప్రాంతంలోని వివిధ అసెంబ్లీ నియోజకవర్గాలలో ఓట్లు ఉండటంతో వారు తమ ఓటు హక్కు వినియోగించు కోవటానికి విచ్చేస్తున్నారు. ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులు ఓటు వేయటానికి స్వస్థలాలకు రావాలంటూ ఫోన్ల ద్వారా ఆహ్వానాలు పంపారు. అయితే బస్ టిక్కెట్లకు డిమాండ్ విపరీతంగా పెరగటంతో తొలుత ప్రత్యేక బస్‌లు వేద్దామనుకున్న అభ్యర్థులు ఇక్కడికి వస్తే టిక్కెట్ చార్జీలు ఇస్తామని ఆయా ఓటర్లకు ఆఫర్లు ఇచ్చారు. అయితే చాలా మంది ఓటర్లు ఓటుహక్కు తమ బాధ్యత అని తాము స్వచ్ఛందంగా ఓటు వేయటానికి ఈ ప్రాంతం వస్తున్నట్లు చెబుతున్నారు. ఆదివారం బస్‌లు, ట్రైన్‌లకు విపరీతమైన రద్దీ ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి.



కలపర్రు టోల్‌గేట్ వద్ద వాహనాల క్యూ

దీంతో పల్లెలు, పట్టణాలు కూడా ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ఓటర్లతో సందడిగా కనిపిస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఎన్నాళ్ళ నుంచో విదేశాల్లో ఉన్న ఓటర్లు కూడా ఓటు వేయటానికి ఈ ప్రాంతం రావడం చర్చనీయాంశంగా మారింది. అంటే ఈ సారి జరిగే సార్వత్రిక ఎన్నికలు ఎంత కీలకమయినవో అర్థం అవుతోంది.

జాతీయ రహదారిపై రద్దీ

పెదపాడు : ఓటర్లు స్వగ్రామాలను చేరుకునేందుకు పెద్దఎత్తున పయనమవడంతో సోమవారం జాతీయ రహదారిపై కలపర్రు టోల్ ప్లాజా వద్ద వాహనాల రద్దీ విపరీతంగా ఉంది. హైదరాబాద్, బెంగళూరు తదితర ప్రాంతాల నుంచి స్వగ్రామాల బాట పట్టారు. రైళ్ల, బస్‌లలో టిక్కెట్లు లేక పోవడం, ఉన్నా అధిక రేట్ల కారణంగా సమీప బంధువులు, స్నేహితులు పరస్పర అవగాహనతో గ్రామాలకు వచ్చేందుకు కార్లను ఆశ్రయిస్తున్నారు. దీంతో రహదారులపై రద్దీ పెరిగింది

కోర్టు భవనాల నిర్మాణానికి శంకుస్థాపన


శంకుస్థాపనలో న్యాయమూర్తులు కృష్ణమోహన్, ఆకుల వెంకట శేషసాయి దంపతులు

భీమవరం క్రైం, మే 11 : భీమవరం పాత సివిల్ కోర్టు ప్రాంగణంలో నూతనంగా రూ.80.60 కోట్ల వ్యయంతో 14 కోర్టుల భవన సముదాయ నిర్మాణానికి హైకోర్టు జడ్జిలు జస్టిస్ బి.కృష్ణమోహన్, జస్టిస్ ఏవీ శేషాయి శనివారం శనివారం శంకుస్థాపన చేశారు. తొలుత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు జడ్జిలు బి.కృష్ణమోహన్, ఏవి శేషసాయి, జైసూర్య, సుబ్బారెడ్డి సత్తిలకు పశ్చిమ గోదావరి జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ జడ్జి పురుషోత్తం కుమార్ చింతలపూడి, భీమవరం బార్ అసోసియేషన్ అధ్యక్షులు మోగళ్ల వెంకట రమణారావు, పాకాల రమేష్‌బాబు, బార్ అసోసియేషన్ సభ్యులు స్వాగతం పలికారు. అనంతరం న్యాయమూర్తి ఆకుల వెంకట శేషసాయిని భీమవరం రెండవ పట్టణంలోని ఆనంద ఫంక్షన్ హాల్‌లో ఘనంగా సన్మానించారు.

అభ్యర్థుల ఖర్చులు నిబంధనలు అనుసరించాలి

భీమవరం టౌన్, మే 11: ఎన్నికల సంఘం నియమ నిబంధలను అనుసరించి అభ్యర్థుల ఖర్చులు ఉండాలని, రాజకీయ పార్టీలు అభ్యర్థులు ఖర్చు చేసే ప్రతి రూపాయిని ఎప్పటికప్పుడు నమోదు చేయాలని నరసాపురం పార్లమెంటు వ్యయ పరిశీలకులు పియూష్ శుక్లా (ఐ.ఆర్.యస్) సూచించారు. శనివారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్‌హాల్‌లో నరసాపురం పార్లమెంటు నియోజవర్గానికి పోటీలో ఉన్న 21 మంది అభ్యర్థుల ప్రచారాలకు సంబంధించి వ్యయాల రిజిస్టర్లను ఆయన పరిశీలన చేసి, పలు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల పోటీలో ఉన్న అభ్యర్థులు ఎన్నికల సంఘం నియమ నిబంధలను అనుసరించి అభ్యర్థుల పార్టీ ప్రచారాల ఖర్చులు ఉండాలన్నారు. రాజకీయ పార్టీల అభ్యర్థులు ఖర్చు చేసే ప్రతి రూపాయని ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు.

నిజాయితీ పరులకు ఓటు వెయ్యండి: చలసాని



భీమవరం టౌన్, మే 11 : ఈ ఎన్నికల్లో నిజాయితీ పరులకు ఓటువెయ్యాలని, ఆంధ్రుల ఆత్మగౌరవానికి, దగాకోరులకు మధ్య జరుగుతున్న ఎన్నికలని, అభివృద్ధికి పట్టంకట్టేవారికే ఓటు వేసి గెలిపించాలని ప్రత్యేక హోదావిభజన హామీల సాధన సమితి వ్యవస్థాపకుడు చలసాని శ్రీనివాస్ అన్నారు. శనివారంనాడు భీమవరం వచ్చిన సందర్భంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. దగా పడ్డ ఆంధ్రులారా కళ్ళు తెరవండి ప్రజాస్వామ్యానికి ఇవే ఆఖరు ఎన్నికలని విజ్ఞతతో ఓటు వెయ్యాలని ఆయన కోరారు. స్టాలిన్, తేజస్వీ యాదవ్‌లను చూసి మన నాయకులు సిగ్గుపడాలన్నారు. ఈకార్యక్రమంలో చెల్లబోయిన రంగారావు, గోపిశెట్టి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చాంబర్స్ విద్యార్థులకు ఉద్యోగాలు

పాలకొల్లు అర్బన్, మే 11 : స్థానిక చాంబర్స్ డిగ్రీ, పీజీ కళాశాలలలో చదువుతున్న విద్యార్థులు ఈనెల 10వ తేదీన జరిగిన క్యాంపస్ ఇంటర్వ్యూలలో ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు శనివారం తెలిపారు. స్కిల్ దునియా కంపెనీకి 51 మంది, స్టార్ టెక్ కంపెనీకి 38 మంది ఎంపికైనట్టు తెలిపారు. ఎంపిక అయిన వారికి రూ. 45వేలు వేతనం లభిస్తుందన్నారు.

ల్యాండ్ టైట్లింగ్ జిరాక్స్ కాపీల దహనం

నరసాపురం టౌన్, మే 11: మన ఆస్తులకు మనమే యాజమానులుగా ఉండాలంటే జగన్‌ను ఓడించాలని టీడీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ రాజ్యలక్ష్మి అన్నారు. శనివారం టీడీపీ ఆధ్వర్యంలో ల్యాండ్ టైట్లింగ్ యాక్టును నిరసిస్తూ అమె నివాసం వద్ద జిరాక్స్ కాపీలను దహనం చేశారు. కూటమిని గెలిపించుకుని మన భూముల్ని రక్షించుకుందామని పిలుపునిచ్చారు. జగన్‌కు ఓటు వేయడమంటే భూ హక్కుల్ని వదులుకోవడమేనన్నారు.

ఉండిలో టీడీపీ నాయకుల సస్పెన్షన్

భీమవరం, మే 11(ఆంధ్రజ్యోతి): ఉండి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి వ్యతిరేకంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న నాయకులు, కార్యకర్తలను ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే రామరాజు సస్పెండ్ చేశారు. ఉండి ఏఎంసీ మాజీ చైర్మన్ సాగిరాజు సాంబశివరాజు, బురిడి రవిబాబు, మోపిదేవి శ్రీనివాస్, వత్సవాయి సుజాత, వత్సవాయి సూర్యానారాయణ రాజు, వేగేశ్న అనంతలక్ష్మీలు సస్పెన్షన్‌కు గురయ్యారు. కాళ్ల మండలంలో కాలవ వెంకట్రావు, కాలవ లక్ష్మి, నూకల వెంకటస్వామి, కోరాశిఖ నాగేశ్వరరావు, గుడ్లసతీష్; గోడి నాగరాజు తదితరులను సస్పెండ్ చేస్తూ పార్టీ అధ్యక్షుడు రామరాజు ఆదేశాలు జారీచేశారు,

మద్యం దుకాణాలకు సీల్

భీమవరం క్రైం, మే 11 : ఈనెల 13వ తేదీ ఎన్నికలు సందర్భంగా మద్యం దుకాణాలు మూసివేశారు. శనివారం మధ్యాహ్నం 2గంటల నుంచి ప్రభుత్వ మద్యం దుకాణాలు, బార్‌లు మూసివేశారు. దీంతో మందుబాబులు ఉరుకులు, పరుగులు పెట్టారు. కొన్నిచోట్ల క్యూకట్టారు. అయినా కూడా ప్రభుత్వ మద్యం దుకాణాల్లో మద్యం లేకపోవడం సరైన బ్రాండ్లు లేకపోవడంతో బార్లు వద్ద అధిక ధరలకు మద్యం కొనుగోలు చేశారు. సోమవారం సాయంత్రం 7గంటల వరకు మద్యం దుకాణాలు మూసివేస్తారని ప్రచారం జరగడంతో ముందుగానే మద్యం కోసం ఎగబడ్డారు.

పెనుమంట్ర: పెనుమంట్ర ప్రభుత్వం మద్యం దుకాణం వద్ద మద్యం ప్రియులు బారులు తీరారు. కొన్ని గంటల్లో ఎన్నికల నియమ నిబంధనలతో మద్యం షాపులు మూసివేస్తారన్న సమాచారంతో భారీగా మదుబాబులు తరలివచ్చారు.

ఆచంట: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఆయా గ్రామాల్లో ఉన్న మద్యం షాపులను శనివారం సాయంత్రం మూసి వేసి షాపును సీల్ వేశారు. ఈనెల 13న ఎన్నికల అనంతరం మద్యం షాపును తెరుస్తామని అప్పటి వరకు షాపును మూసి వేయడం జరుగుతుందన్నారు.

నరసాపురం: ఇటు ఎన్నికల ప్రచారం ముగియగానే ఎక్సైజ్ అధికారులు మద్యం దుకాణాలు, బార్‌లకు సీల్ చేశారు. ఆశాఖ ఉన్నతాధికారులు దగ్గరుండి అన్ని షాపులకు సీల్ చేశారు. మళ్లీ సోమవారం సాయంత్రం పోలింగ్ తరువాత వీటిని తెరవనున్నారు. నిబంధనలు అత్రికమించి మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్డీవో అంబరీష్ హెచ్చరించారు.

పాలకొల్లు అర్బన్: ఎన్నికల దృష్య శనివారం సాయంత్రం నుండి మద్యం షాపులు మూసి వేస్తుండటంతో శనివారం మద్యం షాపులముందు క్యూలైన్లు కనిపించాయి. ఆది, సోమవారాల్లో మద్యం షాపులు మూసి వేస్తారు. దీంతో శనివారం షాపుల ముందు మద్యం షాపుల ముందు మందు బాబులు క్యూకట్టారు. అయితే ఎవరికి ఎన్ని బాటిల్స్ కావాలో అన్ని ఇస్తుండటంతో మందుబాబులకు పండుగగా మారింది.

ఓటర్ల కోసం ప్రత్యేక బస్సులు

నరసాపురం, మే 11: హైదరాబాద్ నుంచి నరసాపురం వచ్చి ఓటు వేసే ఓటర్ల కోసం కూటమి ప్రత్యేక రవాణ సదుపాయం ఏర్పాటు చేసింది. సుమారు 30 బస్సుల్ని ఏర్పాటు చేసింది. ఇప్పటికే చాలా మంది ఓటర్లు రైళ్ళల్లో నరసాపురం చేరుకున్నారు. మరికొంత మంది ఆదివారం రానున్నారు. సోమవారం వీరంతా తిరుగుముఖం పట్టనున్నారు. ఇటు సిటీ నుంచి వచ్చిన చాలా మంది పార్టీపై తమకున్న అభిమానాన్ని చాటుకునేందుకు శనివారం చివరి రోజు కూటమితో కలిసి ప్రచారం చేశారు.

పాలకొల్లు అర్బన్: హైదరాబాద్, తదితర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ఓటర్లు తరలి వచ్చారు. బస్సులు, రైళ్ళు, సొంత వాహనాల్లో వందలాది మంది వచ్చారు. ఇంకా స్పెషల్ రైళ్ళల్లో టికెట్ బుక్ చేసుకున్నవారికి ఆ రైళ్ళు గంటల కొద్ది ఆలస్యంగా నడుస్తుండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఫోన్లలో పలువురు తెలుపుతున్నారు.

తణుకు: అంధ్రాకు చెందిన తెలంగాణలో ఉంటున్న వారి కోసం ఇక్కడి నాయకులు హైదరాబాదు నుంచి ప్రత్యేకంగా బస్సులు ఏర్పాటు చేశారు. ఇప్పటికే వివిధ నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు సేకరించారు. అక్కడ ఆత్మీయ సమావేశాలు కూడా జరిపారు. వీరి కోసం ప్రత్యేకంగా తరలించేందుకు కో-ఆర్డినేటర్లను కూడా నియమించారు. తణుకు నియోజకవర్గానికి సంబంధించి సుమారు నాలుగు వేల వరకు వివిధ గ్రామాలకు వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న శ్యామలాదేవి.. ప్రచారంలో పాల్గొన్న బొలిశెట్టి శ్రీనివాస్, వలవల తదితరులు

క్వారీ కార్మికులకు అండగా ఉంటా: బొలిశెట్టి

తాడేపల్లిగూడెం రూరల్, మే 11: ఆరుగొలను, కొత్తూరు, నవాబుపాలెంలో గ్రావెల్ క్వారీలపై జీవనం సాగించే కార్మికులకు అండగా ఉంటానని కూటమి జనసేన అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ హామీ ఇచ్చారు. తాడేపల్లిగూడెం మండలం కొత్తూరు, ఆరుగొలను, నవాబుపాలెం గ్రామాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యసభ మాజీ సభ్యురాలు తోట సీతారామలక్ష్మి మాట్లాడుతూ దేశంలో మోదీ సారథ్యంలో బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలో విజన్ ఉన్న చంద్రబాబు, నిస్వార్థంగా ప్రజల కోసం పరితపించే పవన్‌కల్యాణ్‌ల సారథ్యంలో కూటమి అధికారంలోకి రాగానే రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా నడపడంతోపాటు మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ తు.చ. తప్పకుండా పాటిస్తామన్నారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వలవల బాబ్జి, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ, బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బొలిశెట్టి, వర్మలను గెలిపించాలి

తాడేపల్లిగూడెం అర్బన్, మే 11: అవినీతిని రూపుమాపేందుకు కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్, ఎంపీ అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాసవర్మను భారీ మెజారిటీతో గెలిపించాలని దివంగత కృష్ణంరాజు సతీమణి శ్యామలాదేవి అన్నారు. శనివారం పట్టణంలోని జనసేన కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ అధికారంలో లేనప్పటికీ సాయం కోసం వచ్చిన వారికి ఎల్లప్పుడూ సాయం చేస్తున్న బొలిశెట్టి సేవలు అభినందనీయమన్నారు. ఇలాంటి వారిని గెలిపిస్తే ప్రాంతాలు అభివృద్ధి అవుతాయన్నారు. బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ అవినీతి పాలకులకు ప్రజలంతా కలసి ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. తనకు ఒక్క అవకాశం ఇస్తే నియోజకవర్గ అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తానన్నారు.



వేల్పూరులో కృష్ణతులసి.. అత్తిలిలో నిఖిల్ రత్న ప్రచారం

సంక్షేమం పేరుతో వైసీపీ బ్లాక్ మెయిల్ : కృష్ణతులసి

తణుకు, మే 11: వైసీపీ ప్రభుత్వం సంక్షేమం పేరుతో ప్రజలను బ్లాక్ మెయిల్ చేస్తోందని టీడీపీ కూటమి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ సతీమణి కృష్ణతులసి అన్నారు. శనివారం వేల్పూరులో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. వైసీపీ దుర్మార్గాలు, ప్రజలు ఇబ్బందులు ఏకరువు పెట్టారు. మూడు సార్లు ఎన్నికల ప్రచారం చేశారని ఇప్పుడు వస్తున్న విశేష ఆదరణ ఎన్నడూ చూడలేదని వివరించారు. అభివృద్ధి చేసిన, చేయాలని తపించే రాధాకృష్ణకు సైకిల్ గుర్తుపై, ఎంపీకి కమలం గుర్తుపై ఓట్లు వేయాలని కోరారు.

నాన్నను గెలిపించండి : నిఖిల్ రత్న

తణుకు, మే 11: నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న తన తండ్రి ఆరిమిల్లి రాధాకృష్ణను అసెంబ్లీ ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని టీడీపీ అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ తనయుడు నిఖిల్ రత్న అన్నారు. శనివారం అత్తిలిలో తండ్రి రాధాకృష్ణ విజయం కోరుతూ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. 2014-19 మధ్య కాలంలో తన తండ్రి ఎమ్మెల్యేగా పనిచేసినప్పుడు చేసిన అభివృద్ధే తప్ప వైసీపీ పాలనలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. వైసీపీ పాలనలో పేద, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. నిత్యావసరాలు, విద్యుత్ చార్జీలు, గ్యాసు, డీజిల్ ధరలు పెరిగి సామాన్యులు, ఉపాధి లేక నిరుద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ప్రచారంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.



పాలకొల్లులో విద్యుత్ స్తంభానికి లాంతరు కడుతున్న నిమ్మల..
ఏనుగువానిలంకలో ప్రచారం చేస్తున్న నిమ్మల సూర్య కుమారి

విద్యుత్ స్తంభానికి లాంతరు కట్టిన నిమ్మల

పాలకొల్లు టౌన్, మే 11: ప్రజల కరెంట్ కష్టాలపై పాలకొల్లు ఎమ్మెల్యే, కూటమి అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి నిమ్మల రామానాయుడు వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించారు. వెలగని వీధి విద్యుత్ స్తంభానికి లాంతరు కట్టి జగన్ దురదృష్టవశాత్తు మళ్లీ అధికారంలోకి వస్తే భవిష్యత్తు అంధకారంగా ఇదే పరిస్థితి ఎదురవుతుందన్నారు. ప్రజలు విజ్ఞతతో ఆలోచించి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేలా ఓటేయాలని అభ్యర్థించారు. స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలో శుక్రవారం అర్ధరాత్రి లాంతరు పట్టుకుని వెలగని విద్యుత్ స్తంభం దగ్గరకు వెళ్లి లాంతరు కట్టారు. పాలకొల్లులో గత టీడీపీ ప్రభుత్వంలో మంజూరైన 132 కేవి సబ్ స్టేషన్ నిర్మాణం చేస్తామని హామీ ఇచ్చారు.

సూర్యకుమారి ప్రచారం

యలమంచిలి, మే 11: కూటమి మేనిఫెస్టోలో పొందుపరిచిన పథకాలతో రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుతుందని ఎమ్మెల్యే డాక్టర్ నిమ్మల రామానాయుడు సతీమణి సూర్యకుమారి పేర్కొన్నారు. ఏనుగువానిలంక, అరట్లకట్ల గ్రామాల్లో కూటమి శ్రేణులతో కలిసి నిమ్మల సూర్యకుమారి శనివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు.


టీడీపీ నాయకులతో కలిసి ప్రచారం చేస్తున్న నాయకర్

కూటమిని గెలిపిస్తే సంక్షేమం,అభివృద్ధి

నరసాపురం, మే 11: కూటమిని గెలిపిస్తే ఐదేళ్ల సంక్షేమంతో పాటు రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని జనసేన అభ్యర్థి బొమ్మిడి నాయకర్ అన్నారు. శనివారం ప్రచారం ముగింపును పురస్కరించుకుని పట్టణంలోని మెయిన్‌రోడ్‌లో టీడీపీ నాయకులు కొవ్వలి నాయుడు ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన చేశారు. శివాలయం సెంటర్ నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకు జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొని కూటమిని గెలిపించాలని వ్యాపారులు, పాదచారుల్ని అభ్యర్థించారు. మాజీ మంత్రి కొత్తపల్లి, టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి, బీజేపీ నాయకులు మేకల సతీష్ తదితరులు ఈకార్యక్రమంలో పాల్గొని 7వ వార్డులో ప్రచారం నిర్వహించారు. ఓటర్లంతా ఆలోచించి ఎన్డీఏకు ఓటు వేయాలని కోరారు.

రఘురామ సతీమణి ప్రచారం

ఉండి, మే 11:ఉండి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రఘురామకృష్ణరాజు సతీమణి రమాదేవి ఉండిలో ప్రచారం చేశారు. టీడీపీ అభ్యర్థిని గెలిపిస్తే అభివృద్ధికి బాటలు వేస్తారని అన్నారు. ఎంపీగా ఆయన గ్రామాలకు చేసిన అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ప్రజలంతా ఈఎన్నికలలో ఓట్లు వేసి గెలిపించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో గ్రామ టీడీపీ అధ్యక్షుడు కాగిత బుజ్జి, మండల టీడీపీ అధ్యక్షుడు కరిమెరక నాగరాజు, గొల్ల విక్టర్‌బాబు, మాజీ సర్పంచ్ ముదునూరి విజయకృష్ణంరాజు, మాజీ వైస్ ఎంపీపీ మంతెన కృష్ణకుమారి పాల్గొన్నారు.

ఎన్నికలకు సర్వం సిద్ధం

నేడు పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామగ్రి తరలింపు

పాలకొల్లు అర్బన్, మే 11 : ఈనెల 13వ తేదీన జరగనున్న ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి. బిఎస్ నారాయణ రెడ్డి తెలిపారు. శనివారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ స్థానిక ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఆదివారం పోలింగ్ సామగ్రి పంపిణీ చేయనున్నామని ఆర్వో తెలిపారు. మొత్తంగా 124 సెంటర్లులో 190 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. పోలింగ్ పూర్తి అయిన అనంతరం అసెంబ్లీ బ్యాలెట్ బాక్స్‌లు (ఈవీఎం, ప్యాట్)లను భీమవరం మండలం కొవ్వాడ విలేజ్‌లో ఉన్న బి సీతా పాలిటెక్నిక్ కళాశాలలోనూ, పార్లమెంట్‌కు సంబంధించిన వాటిని కూడా అదే కళాశాలలో ఉన్న స్ట్రాంగ్ రూములకు చేర్చడం జరుగుతుందని ఆర్వో శివనారాయణరెడ్డి తెలిపారు. నియోజక వర్గ పరిధిలో 1. 93. 972 మంది ఓటర్లు ఉన్నారని, వారిలో మహిళలు 98,721 మంది, పురుషులు 95 245మంది, ట్రాన్స్ జెండర్లు 6 గురు ఉన్నట్టు ఆర్వో తెలిపారు.

నరసాపురం: ఆదివారం ఉదయం సిబ్బందికి ఎన్నికల సామగ్రిని సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. వైఎన్ కాలేజీలో దీనికి సంబంధించి అన్ని ఏర్పాట్లు చకచక చేస్తున్నారు. నియోజకవర్గంలో 169 పోలింగ్ కేంద్రాలను ఇప్పటికే సిద్ధంగా ఉంచారన్నారు. మొత్తం 1180 మంది సిబ్బంది పని చేయనున్నారు. ఇది కాకుండా 176 మంది రిజర్వ్ స్టాఫ్‌ను సిద్ధం చేశారు. నియోజకవర్గంలో మొత్తం 22 సమస్యాత్మక గ్రామాలను గుర్తించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కెమెరాలు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు సమీక్షించనున్నారు.

భీమవరం టౌన్: భీమవరం నియోజకవర్గానికి సంబంధించి ఎన్నికల అధికారులకు, సిబ్బందికి సామగ్రిని అందించేందుకు ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేశారు. నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కె శ్రీనివాసులురాజు పర్యవేక్షణలో అధికారులు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం నుంచి డిస్ట్రిబ్యూషన్ కార్యక్రమాన్ని చేపడతారు. నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2లక్షల 53వేల116 మంది ఉన్నారు. ఇందులో లక్షా22 వేల790 మంది పురుషులు, లక్షా30వేల 275 మంది మహిళలు ఉన్నారు. 51 మంది ఇతరులు ఉన్నారు. పోలింగ్ కోసం నియోజక్యవర్గంలో 236 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 1416 మంది సిబ్బందిని వినియోగిస్తున్నారు.

ఆచంట: ఆచంట నియోకవర్గానికి సంబంధించి ఎన్నికల సామగ్రిని పోలింగ్ స్టేషన్‌లకు తరలించేందుకు ఎంవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద పాయింట్‌ను ఏర్పాటు చేశారు. ఆదివారం ఉదయం 7 నుంచి సామగ్రిని సిబ్బందికి అప్పగిస్తామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి స్వామి నాయుడు తెలిపారు. లంక గ్రామాలకు సిబ్బంది వెళ్ళేందుకు పడవలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

ఉండి: ఉండి నియోజకవర్గంలో పోలింగ్‌కు సర్వ సిద్ధమైనట్లు జిల్లా జాయింట్ కలెక్టరు, ఆర్వో సిప్ర ప్రవీణ్‌ఆదిత్య వెల్లడించారు. నియోజకవర్గంలో 2.24లక్షల మంది ఓటర్లు వున్నారన్నారు. 238 పోలింగ్ కేంద్రాలున్నాయన్నారు. ఇందులో 38 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలున్నాయని తెలిపారు. రిసెప్షన్ కేంద్రంగా భీమవరంలోని ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో 209 పోలింగ్ స్టేషన్‌లకు గాను పీవోలు 209 మంది, ఏపీవోలు 209 మంది, ఓపీవోలు, సర్వైలెన్స్ టీం ఇలా 1374 మంది సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు రిటర్నింగ్ అధికారి కె. చెన్నయ్య తెలిపారు. 209 పోలింగ్ కేంద్రాల్లో 63 పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించారు. ఎన్నికల సిబ్బందికి శనివారం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో రిటర్నింగ్ అధికారి ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు.



టీడీపీలోకి ఆహ్వానిస్తున్న టీడీపీ కూటమి అభ్యర్థి పితాని..మార్టేరులో పితాని తనయుడు మోటార్ సైకిల్ ర్యాలీ

వైసీపీ వస్తే మీ భూమి మీది కాదు: పితాని

పోడూరు, మే 11: రాష్ట్రంలో మళ్లీ వైసీపీ అధికారంలోకి వస్తే మీ భూమి మీది కాదని ప్రజల ఆస్తులను దోపిడీ చేసేందుకు జగన్ ప్రభుత్వం అడ్డగోలుగా ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని తీసుకొచ్చిందని ఆచంట అసెంబ్లీ కూటమి టీడీపీ అభ్యర్థి పితాని సత్యనారాయణ అన్నారు. కొమ్ముచిక్కాలలోని ఆయన క్యాంపుకార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దిశ, దశ లేని భూ హక్కు చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ చాలాకాలంగా న్యాయవాదులతో సైతం బార్ అసోసియేషన్లు దీక్షలు, పోరాటాలు చేపట్టాయన్నారు. ప్రజలు తమ ఆస్తులపై హక్కు కోల్పోవడమే కాకుండా తాత, ముత్తాత, తండ్రి నుంచి సంక్రమించిన ఆస్తులు దోపిడీకి గురవుతాయన్నారు. ఇటువంటి ఈ భూ హక్కు చట్టాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

మాముడూరులో టీడీపీలో చేరిక

పెనుమంట్ర: మాముడూరులో వైసీపీ నుంచి మామిడి శెట్టి రవి ఆధ్వర్యంలో 30 మంది మాజీ మంత్రి టీడీపీ పోలిట్ సభ్యులు పితాని సత్య నారాయణ సమక్షంలో టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా పితాని సత్యనా రాయణ మాట్లాడుతూ ఈనెల 13 వ తేదీన జరగనున్న ఎన్నికల కురుక్షేత్రంలో ప్రజా స్వామ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ఓటు ఆయుధంతో అవినీతి అరాచక పాలన సాగిస్తున్న జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని గద్దె దింపాలని పిలుపునిచ్చారు.

తండ్రి గెలుపు కోసం తనయుడు బైక్ ర్యాలీ

పెనుమంట్ర, మే 11 : మార్టేరులో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి పితాని సత్యనారాయణ సైకిల్ గుర్తుకు ఓటు వేసి తన తండ్రిని గెలిపించాలని కోరుతూ తనయుడు భానుచందర్ బైక్ ర్యాలీ నిర్వహించారు. రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ అధికారంలోకి రాబోతుందని అభివృద్ధి సంక్షేమంతో పాటు రాజధాని నిర్మాణం పోలవరం ప్రాజెక్టు పూర్తి చేస్తారని చెప్పారు. కేంద్రంలో నరేంద్ర మోదీ సర్కార్ రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం రాబోతుందని అన్నారు. కార్యక్రమంలో తెలుగు దేశం పార్టీ మండల అధ్యక్షుడు తమనంపూడి శ్రీనివాసరెడ్డి, తేతలి రాజారెడ్డి జనసేన మండల అధ్యక్షుడు కోయ వెంకట కార్తీక్, పాల్గొన్నారు.

అధికార పార్టీపై వ్యతిరేకత స్పష్టమైంది: వర్మ


భారీ ర్యాలీ పాల్గొన్న భూపతిరాజు శ్రీనివాసవర్మ

భీమవరం టౌన్, మే 11 : అధికార పార్టీపై వ్యతిరేకత స్పష్టంగా కనిపిస్తోంది. అందుకే ఈ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు గెలవబోతున్నారని నరసాపురం పార్లమెంటు బీజేపీ ఉమ్మడి అభ్యర్థి భూపతి రాజు శ్రీనివాస వర్మ ప్రకటించారు. ప్రభుత్వం అన్ని విధాలుగా రాష్ట్రాన్ని దెబ్బతీసిన విషయం ప్రజలందరికీ తెలుసని, ప్రతి కుటుంబం ఏదో రూపంలో ఇబ్బందులు పడిందని అన్నారు. ఎన్నికల ప్రచారం ముగింపు సందర్భంగా భీమవరంలోని ఎన్నికల కార్యాలయంలో శనివారం నాడు విలేకరులతో మాట్లాడారు. ఎంపీగా శ్రీనివాస్ వర్మను ఎందుకు ఎన్నుకోవాలని విషయంలో తాను పూర్తి స్పష్టతతో ఉన్నానన్నారు. 34 ఏళ్లుగా బీజేపీతో ఉండటంవల్లే తనకు సీటు వచ్చిందన్నారు. ఈ ప్రజా జీవితంలో ఏ రోజు తాను అవినీతి, అక్రమాలకు పాల్పడలేదని ఆరోపణలు కూడా లేవన్నారు. ఇవన్నీ తనకు కలిసి వస్తున్నాయన్నారు. సామాన్యుడిగా వెళుతుంటే అన్ని వర్గాలు ఎంతో ఆదరించారన్నారు. నియోజవర్గంలో 65 శాతం గ్రామాలు తిరిగానని మిగిలిన గ్రామాల్లో ప్రజలు తనను అర్థం చేసుకుని సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

పట్టణంలో భారీ ర్యాలీ

నరసాపురం పార్లమెంట్ ఉమ్మడి కూటమి అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాసవర్మ ఎన్నికల ప్రచారం ముగింపు సందర్భంగా పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అడ్డవంతెన దగ్గర నుంచి ప్రారంభమైన ర్యాలీ తీన్‌మార్ డప్పులు, బాణ సంచాకాల్పుల మధ్య సాగింది.

బీజేపీ మేనిఫెస్టో విడుదల

తమ పార్టీ బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నరసాపురం పార్లమెంటును అన్ని రంగాలలోనూ అభివృద్ధి చేస్తామని బీజేపీ ప్రకటించింది. నర్సాపురం పార్లమెంటు పరిధిలో ఎన్నికల మేనిఫెస్టోను శనివారం పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ పాక వెంకట సత్యనారాయణ, జిల్లా పార్టీ అధ్యక్షుడు నారిన తాతాజీలు మీడియాకు విడుదల చేశారు. జిల్లా అంతటా నరసాపురం పార్లమెంటు పరిధిలో ఉన్నందున ఇక్కడి ప్రజలకు అవసరాలకు అనుగుణంగా, సంక్షేమ అభివృద్ధి పనులు చేపడ తామని చెప్పారు. ప్రధానంగా వరి, ఆక్వా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి ప్రత్యేక దృష్టి సారించామని వారు పేర్కొన్నారు. జల వనరుల శాఖ పరిధిలో మురుగు పంట కాలువల సమస్యలు, ముంపు సమస్యలను కూడా పరిష్కరించే విధంగా కృషి చేస్తామన్నారు.. చాలా కాలంగా ఈ ప్రాంతానికి రావలసిన టౌన్ ఆఫ్ ఎక్సలెన్సీ గ్రాంటును తీసుకురావడానికి కృషి చేస్తామన్నారు. వీటితో పాటు మరికొన్ని హామీలు ఇచ్చారు.

సమస్యల పరిష్కారానికి అంజిబాబు హామీ


కొవ్వాడ అన్నవరంలో ప్రచారం చేస్తున్న అంజిబాబు

భీమవరం టౌన్, మే 11 : భీమవరం అసెంబ్లీ జనసేన ఉమ్మడి అభ్యర్థి పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) ఎన్నికల ప్రచారం చివరిరోజున ఉత్సహంగా పట్టణంలోను, గ్రామాల్లో సాగింది. పట్టణంలోని 21,22, 26,27,29 వార్డుల్లో ఆయన ప్రచారంచేసి ఓట్లు అభ్యర్థించారు. పట్టణంలో మంచినీటి సమస్య తలెత్తకుండా చూస్తానని హామి ఇచ్చా రు. వార్డులలో సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరిస్తానని అన్నారు. రోడ్లు, డ్రెయినేజీ సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. ఈప్రభుత్వ హయాంలో పట్టణంలోని సమస్యలను పట్టించుకోలేదని విమర్శించారు. టిడ్కో ఇళ్ళు గతంలో తాము నిర్మిస్తే ఇప్పుడు రంగులు వేసి తామే అభివృద్ధి చేసినట్లుగా చెప్పుకుంటున్నారని అన్నారు. ఇప్పటికీ కనీస మౌలిక సదుపాయాలు కల్పించలేకపోయారన్నారు. తమకూటమి అధికారంలోకి రాగానే మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక దృష్టి పెడతామన్నారు. జగనన్న ఇళ్ళకూడా కట్టలేకపోయారని అన్నారు. పట్టణంలో 4వేల 200 ఇళ్ళకు గాను కేవలంలో 4 సంవత్సరాల్లో 12 వందల ఇళ్ళు మాత్రమే నిర్మించారని అన్నారు.

రూరల్ మండలంలోని కొవ్వాడ అన్నవరంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలో మాట్లాడుతూ పంచాయతీ నిధులను ఈ ప్రభుత్వం వాడుకుని గ్రా మాల అభివృద్ధికి గ్రహణం పట్టించారని విమర్శించారు. గ్రామాల్లో డ్రైనేజీ,రహదారుల అభివృద్ధి పనులు చేపట్టడంలో విఫలం చెందిందని అన్నారు. తాగునీటి సమస్యలు కూడా గ్రామాల్లో పెరిగాయని, ఈసమస్యకు ప్రత్యేక దృష్టిపెడతామన్నారు. కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి చెనమల చంద్రశేఖర్, పడమట రామకృష్ణ, మద్దుల రాము, కార్మురి సత్యనారాయణమూర్తి, కోళ్ళ నాగేశ్వరరావు, సుబ్రహ్మణ్యం రాజు పాల్గొన్నారు.

నర్సులకు సన్మానం

ఆకివీడు, మే 11: అంతర్జాతీయ నర్సుల దినోత్సవం పురస్కరించుకొని సీహెచ్‌సీ ప్రభుత్వాసుపత్రిలో శనివారం హెడ్‌నర్సు జోత్స్న నేతృత్వంలో ఫ్లోరెన్స్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నర్సులను ఆదర్శ లయన్స్ క్లబ్ ప్రతినిధులు సన్మానించి బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ నజరిన్, వైద్యులు, నర్సులు పాల్గొన్నారు.

ప్రతి రోజూ కుక్కకాటు బాధితులు

ఆకివీడు, మే 11:కుక్కకాటు బాధితులు అధికంగా వస్తున్నారని సీహెచ్‌సీ ఆసుపత్రి సూపరింటెండెంట్ నజరిన్ తెలిపారు. కోళ్ళపర్రుకు చెందిన వ్యక్తికి శనివారం కుక్క కరవడంతో ఆసుపత్రికి వచ్చి ఇంజెక్షన్ చేయించుకున్నాడు. డాక్టర్ నజరిన్ మాట్లాడుతూ ఆసుపత్రికి కుక్కకాటు బాధితులు రోజుకి ఐదారు మంది వస్తున్నారని వారికి ఇంజెక్షన్లు చేసి మందులు ఇచ్చి పంపిస్తున్నామన్నారు.

వార్డుల్లో కూటమి నాయకుల విస్తృత ప్రచారం

పాలకొల్లు అర్బన్, మే 11 : పట్టణంలో శనివారం 12, 13, 14 వార్డుల్లో, బీజేపీ నాయకులతో కలిసి టీడీపీ, జనసేన నాయకులు పార్లమెంట్ అభ్యర్థి శ్రీనివాసవర్మకు, అసెంబ్లీ అభ్యర్థి నిమ్మల రామానాయుడుకు ఓటు వేసి గెలిపించాలని విస్తృతంగా ప్రచారం నిర్వహిచారు. ఈ కార్యక్రమంలో నాయకులు జక్కంపూడి కుమార్, ఎస్‌కేపీ రఘుబాబు, కె కొండ ప్రసాద్, భైలా శ్రీధర్, మల్లిఖార్జున రెడ్డి, పవన్ నాయుడు, సురేష్, మామిడి శివయ్య కొణిజేటి గుప్త, టిడిపి, జనసేన నాయకులు ఉన్నారు.